భగవద్ధ్యాన సోపానమ్

శ్రీవేదాన్త దేశిక ప్రణీతమ్

ఆన్ధ్రటీకా తాత్పర్య

మనోరమా

వ్యాఖ్యాన సహితమ్

వ్యాఖ్యాత

కె. వి. రాఘవాచార్యులు

తిరుమల తిరుపతి దేవస్థానము వారి

ఆర్థిక సహాయముతో ముద్రింపబడినది

భగవద్ధ్యాన సోపానమ్

శ్రీవేదాన్త దేశిక ప్రణీతమ్

ఆన్ధ్రటీకా తాత్పర్య

మనోరమా

వ్యాఖ్యాన సహితమ్

వ్యాఖ్యాత

కె. వి. రాఘవాచార్యులు

తిరుమల తిరుపతి దేవస్థానము వారి

ఆర్థిక సహాయముతో ముద్రింపబడినది

ప్రతులు 1000

వెల రూ. 12-00

ప్రతులు లభించు స్థలము :

శ్రీ కె. వి. రాఘవాచార్యులు
16-11-16/2-డి ప్లాట్ 183
శ్రీపురము కాలనీ, మలక్‌పేట,
హైదరాబాదు-500 036.

శ్రీమతే రామానుజాయనమః

రంగవల్లి

డా॥ ముడుంబై నరసింహాచార్య
వైష్ణవ శాఖాధ్యక్షులు,
మదరాసు విశ్వవిద్యాలయము,
మదరాసు - 600 005

శ్రీ మద్రామానుజ దర్శన ప్రతిష్ఠాపనాచార్యులలో అగ్రగణ్యులు శ్రీమద్వేదాంత దేశికులను సుప్రసిద్ధ బిరుద నామముగల వేంకటనాథులు. 14వ శతాబ్దియందు దక్షిణ దేశమున ఘంటావతారులుగా వెలసిన వీరు బహుముఖప్రజ్ఞా ధురంధరులు వీరు కవితార్కికసింహులు; సర్వతంత్ర స్వతంత్రులు. కావ్యనాటక వేదాన్త శాస్త్ర ప్రక్రియలలో పరిశ్కృతముగా వెల్లి విరిసిన వీరి అమోఘ రచనా వ్యాసంగము ద్రవిడ సంస్కృత భాషలలోను, తదుభయమేళన రూపమగు మణి ప్రవాళ శైలియందును నిరూఢమై జిజ్ఞాసువులగు పండితప్రకాండులకు శిరోధార్యమైయున్నది. శ్రీ వైష్ణవ సంప్రదాయమున సుప్రసిద్ధులై పాండితీమండితులైన ఆచార్యులిద్దరే. ఒకరు భగవద్యామునాచార్యులు. రెండవవారు శ్రీ వేదాంతదేశికులు. ఇందు విప్రతిపత్తిలేదు.

శ్రీదేశికులు రచించిన స్తోత్రము లించుమించు ముప్పది. వానికెల్ల తలమానికము "భగద్ధ్యాన సోపానము". తమిళభాషలో తిరుప్పాణాళ్వార్లు గానమొనర్చిన అమలనాది పిరాన్ అని ప్రారంభమైన ప్రబంధ రత్నమే ఈ స్తోత్రమునకు మూలము ఇందలి వృత్తము 'మందాక్రాంతము'. "మ,భ,న,త,త, గురుద్వయము' అను గణ విభాగము గల యీ వృత్తము నాయికానాయకుల శృంగారమును, ముఖ్యముగా విరహములను, వర్ణించుటకనువైనది. కాళిదాస మహాకవి తన 'మేఘదూతము'న నీ వృత్తమునే ప్రయోగించెను. వేదాంతదేశికులు తన "మనీష"యందు నాయికాత్వమునారోపించుకొని శ్రీరంగ విభుని సర్వాతిశాయియగు సర్వావయవ సుషమను అనుభవించిరి. ఈ తీరు ప్రకృత "మనోరమా" వ్యాఖ్యలో వివృతమైనది. కావున దేశికులీస్తోత్ర రచనలో వృత్తౌచిత్యమును పాటించిరనుట సహృదయైక వేద్యము.

శ్రీ దేశకులీస్తోత్రమును ఎపుదేసందర్భమున రచించిరో ఊహించుట దుష్కరము 'అమలనాది పిరాన్' ప్రబంధమును వీరను సంధించిన దినములలోనే తత్సౌందర్యము నకు ముగ్ధులై దేశికులు దీనిని రచించిరనుట యుక్తియుక్తము. "సోపాన"మనగా మెట్టు ఒక భవనమునో, సింహాసమునో అధిరోహించుటకు ఒక మెట్టు తర్వాత మరొక మెట్టును మెల్లమెల్లగా (మంద) పదమూని ఎక్కుట (అక్రాంత) అనుభవ సిద్ధమే. ఆదేరీతి శ్రీరంగనాధ చామీకర కిరీట శోభననుభవించుటకు క్రమక్రమముగా శ్రీవారి పాదకమలములను, తరువాత జంఘలను, ఊరువులను, నాభిని, వక్షమును, భుజము లను. చేరి, ఆ తరువాత ముఖమండలమును మనోనయనములతో తిలకింపవలెను. ఆ పిమ్మట రత్నకిరీటమును చేరుకోవలెను, ఇది సోపానారోహణక్రమము. ఇది ప్రణిధాన పరులైన భక్తియోగుల ఉపాసనాక్రమము. ఇది సోపాన మార్గము." "ఆరోహణార్థం నవమౌవనేన కామస్య సోపాన మివ ప్రయుక్తమ్" అని కాళిదాసు పార్వతి ఉదరముపైనున్న వళులను, "యౌవనం'' అధిరోహించుటకు అనువుగా కాముడు ఏర్పరచిన సోపానముగా ఉత్ప్రేక్షించెను. బహుశః ఆ భావనను దృష్టిలోనుంచు కొనియే శ్రీదేశికులు ఈ స్తోత్రమునకీ నామకరణముగావించి యుండవచ్చును. "అమల నాది పిరాన్" అన్న ద్రవిడ ప్రబంధముననుసంధించి యనుభవింపలేనివారు ఈ స్తోత్రమును పఠించి తరించవచ్చును. శ్రీదేశికులీస్తోత్రమును "అంతర్ జ్యోతి" అని, విష్ణు వాచకమైన "అ"కారముతో నారంభించిరి. అంతియకాదు. ప్రణవమున మొదటి యవయవము 'అ' కారము. స్తోత్రాంతమున నున్నది "తత్" అనునక్షరము. ఈ రెంటిని చేర్చిన, ఓంతత్' అని ప్రారంభమగు గాయత్రీ మంత్రము సూచిత మగుచున్నది. "గాతారం త్రాయతే" అనునది గాయత్రీశబ్ద నిరుక్తి, "తన్ను గానము (అనుసంధానము) చేయు వారిని రక్షించునది" యని దీని భావము. గాయత్రి వలె, యీ స్తోత్రమును నిత్యానుసంధానయోగ్యమని దేశికులు వ్యంగ్యమర్యాదచే సూచించు చున్నారు.

ఇట్టి విశిష్ట స్తోత్రమును విశిష్టాద్వైత మత రహస్యద్యోతకమగు 'మనోరమా' వ్యాఖ్యతో శిష్టవ్యావహారిక శైలిలో అత్యంత రమణీయముగా సంతరించి, తాము తరించుటే గాక సకల పాఠక వర్గమును తరింపజేయుచున్న భాగవత శతంసులు శ్రీ కె. వి. రాఘవాచార్యులవారు శ్లాఘనీయులు. శ్రీదేశికుల శైలి ప్రాయశః క్లిష్టము. గంభీరము. వీరి రచనలననువదించుట కత్తిపై సాముపంటిది, అందునను రెండంయుల

కర్తి. ఇటు సమగ్ర ద్రావిడ (తమిళ) భాషావైదుష్యము, అటు కూలంకష సంస్కృత భాషాపాటవము ఉన్ననే కాని అది అసాధ్యము. తెనుగులోనే కాక తమిళ సంస్కృతముల లోను అసమానమైన పాండిత్యమును గడించిన శ్రీ రాఘవాచార్యులవారు ఈ దుష్కర కృత్యమున ఘన విజయమును సాధించిరి. తమ 'మనోరమ'లో వీరు పదే పదే ఉదాహరించిన దివ్యసూరి సూక్తులు, ఆచార్యవాక్కులు, శ్రీ సంప్రదాయ రహస్యములు దీనికి నిదర్శనము.

శ్రీ దేశికుల గోదా స్తుతిని, మాఘకావ్య వైభవమును ఇదివఱకే "ఆంధ్రావళి మోదముంబొరయునట్టు" లందించిన శ్రీ ఆచార్యుల వారు ఇట్టి ఉత్తమ రచనలను ఇతోధికముగా కావించి లోకోపకారము నొనరించుటకు తగిన ఆయురారోగ్యైశ్వర్యములనను గ్రహించుగాక యని సర్వాచార్య పరిచర్యా ప్రీతుడగు సర్వాంతర్యామి శ్రీరంగనాథుని మనసార ధ్యానించుచున్నాడను.

తేది 10-4-81

ముడుంబై నరసింహాచార్య

శ్రీమతే రామానుజాయనమః

సంపీక్ష

శ్రీ రంగాచార్య
లెక్చరర్, పాలెం 500 215

శ్రీమద్వేదాంత దేశికులవారు గరీయః ప్రతిభులు. శ్రీవేంకటేశ్వర సన్నిధి ఘంటావతారులు. శతాధిక గ్రంథకర్తలైన వీరు తమ రచనల ద్వారా శ్రీ సంప్రదాయమునకు గొప్ప సేవ చేసి ఒక కాంతి వైజయంతికను ప్రతిష్ఠించుటే కాక, వీని వలన సంస్కృత సాహిత్యమునకు శాశ్వత కీర్తి చంద్రికలను విస్తరింప చేసినారు.

సంస్కృత ద్రావిడ వేద సాగరములను చుళుకీకృత మొనర్చి అపర అగస్త్యులైన దేశికులవారి కృతులు- ఒక్కొక్కటి ఒక ప్రత్యేకతను సంతరించుకొని- శ్రీ సంప్రదాయాభిమానులకు, సాహితీ మూర్తులకు సమాదరణీయములుగా ఈ నాటికిని నిలిచియున్నవి.

అట్టివానిలో 'భగవద్ధ్యాన సోపానమ్' ఒకటి. ఇది ఒక లఘుకృతియైనను కవితా వస్తువిషయములందు మాత్రము అలఘుకృతి.

పన్నిద్దరాళ్వారులలో నొకరైన 'తిరుప్పాణాళ్వారు' (మునివాహనులు) శ్రీరంగనాయకులను స్తుతించుచు చెప్పిన 'అమలనాది పిరాన్' అను గ్రంథము నాలాయిరదివ్య ప్రబంధములో చేరినది.

మునివాహనులు శ్రీరంగనాథుని కన్నులార సేవించి, పాదాదికేశపర్యంతము అభివర్ణించి, తత్సౌందర్యము ననుభవించి, భగవద్దివ్యమంగళ విగ్రహమునందు అంతర్ధానమైనారు.

ఇట్టి అత్యంత పవిత్రము, విశిష్టమునైన 'అమలనాది పిరాన్' దేశికులవారి కవితామూర్తిని, భక్తిబంధురతను ఆకర్షించినది. తత్ప్రభావమే ఈ 'భగవద్ధ్యాన సోపానమ్'.

కృతికర్తలైన దేశికులవారు దీనికి 'శ్రీరంగనాథధ్యాన సోపానమ్' అను పేరు పెట్టినను సమంజసముగనే యుండెడిది. కాని భగవచ్ఛబ్దము యోగారూఢము. శ్రీరంగనాథుని పాదములనుండి కిరీట పర్యంతము భక్తుల మహోవృత్తి వ్యాపించుటకు ఈ స్తోత్రము పడికట్ల సోపానముల-వలెనుండునను ఒక చమత్కారమైన ఉక్తి ఈ స్తోత్ర నామమువందు అభివ్యక్తమగుచున్నది.

సంస్కృత సారస్వతోద్యాన వనమున సురభిళ స్తోత్రసుమములు అసంఖ్యాకములు. శిరస్సు మొదలుకొని పాదములవరకు మనుష్య వర్ణనమును, పాదాది కేశ పర్యంతము భగవద్వర్ణనమును చేయవలయునని కలదు,

'మానవా మౌళితో వర్ణ్యా దేవాశ్చరణతః పునః'. (అలంకార శేఖరం) స్తోత్రము లయందు, కావ్యప్రబంధముల యందు నిట్టి పద్ధతి పాటింపబడుచున్నది.

ఈ విధమైన పద్ధతిలో చేరిన 'భగవద్ధ్యాన సోపానము'ను శ్రీమాన్ కె. వి. రాఘవాచార్య స్వామివారు 'మనోరమా' వ్యాఖ్యాయుతముగా మనకందించినారు. వీరు ఒక్కొక్క (శ్లోకము) సోపానమును అనేక విధముల అలంకరించి విశిష్టాద్వైతమున విశిష్టముగా విశ్లేషించినారు. సంస్కృత ద్రావిడ సారస్వతములందలి ఎన్నో విషయములు, వేద సూక్తులు సందర్భోచితముగా ప్రసక్తములై వీరి పాండితీ ప్రతిభను, సంప్రదాయ వేతృతా నిష్ఠాతృత్వమును వ్యక్తము చేయుచున్నవి.

ఆచార్యులవారి వ్యాఖ్యను పరిశీలింపగా అటనటవారు స్పృశింపని కొన్ని యంశములు నాకు తోచినవి.

శ్లో I దేశికులవారు 'అంజనమ్' 'చింతారత్నమ్' అను విశేషణముల నుపయోగించినారు. వరదరాజ పంచాశత్తులో-'సిద్ధాంజనేన భవతైవ విభూషితాక్షాః'. అని తెల్పబడినదానికి దీనికి సంబంధము కలదు. అట్లే ఆళ్వార్లు, ఆచార్యులును శ్రియఃపతిని చింతారత్నమన్నారు.

'శ్రీ స్తనాభరణం తేజః.........చింతామణి మివోద్వాంతం
ఉత్సంగేనంత భోగినః'. అని పరాశరభట్టరుల శ్రీసూక్తి.

వ్యాఖ్యాత ఈ శ్లోకంలోని శబ్దశక్తి మూలకధ్వని విషయమును చక్కగా చర్చా పటువుగా నిరూపించినారు.

శ్లో 4 ఊరువుల వర్ణన. కవి సమయానుసారము ఇవి రంభోరువులు.

"మదమివ మధుకైటభస్య రంభాకరభకరీంద్ర కరాభిరూప్య దర్పం।
స్ఫుటమివ పరిభూయ గర్వగుర్వోఃకి ముపమిమీమహి రఙ్గకుఞ్జరోర్వోః।"

అని శ్రీ పరాశరభట్టరువారి భావన. దేశికుల వారిది 'కదలికా స్తంభ సంభావన'.

శ్లో 5 సమాసోక్తిగల రచన. స్వామివారి నాభి వర్ణన. ఇందులో గంభీర = గృహచ్ఛిద్రములను బయట పడనీయక గంభీరముగా నుండు; సుజాతా = సత్కుల ప్రసూత; వేధసో నిర్మిమాణా = కన్యకా వయస్సు దాటిన పిమ్మట వేదాధ్యయన సంపన్నులగు సత్పుత్రులను ప్రసవించినది; అని కొన్ని పదములను ఒక కుల స్త్రీతో పోల్చిచెప్ప వీలుకలదు. అయితే ఆచార్యులవారు దీనిలో మరికొన్ని విశేషములను చక్కగా నిరూపించినారు.

దేశికులవారి 'తత్త్వముక్తా కలాపమునందలి మంగళా చరణ శ్లోకమునందును "నాభీనాళీ కరింగన్మధుకర పటలీ దత్తహస్తావలంబః" అని కలదు. అట్టి భావమే ఈ సోపానమున పరివ్యక్తమైనది.

శ్లో 7 'హస్తిని' కలదు. ఇది చింతాహస్తిని. అందున ఆడయేనుగును ఉపమించుట ఒక విశేషము. 'కరభోరు' అనిన పదమందలి మార్దవము తదితర సమాన పదములద్వారా ప్రతిభాసింపదు కదా! అందుకే 'హస్తిని పదము.

శ్లో 8 తిలక వర్ణన. దీనికి ఆచార్యులవారు ఎన్నో విశేష విషయములను అనుసంధానించిరి. దేశికులవారు 'పాదుకా సహస్రము'ను చెప్పగా, దానిచే ప్రభావితులైన కొమ్మకంటి నరసింహ శాస్త్రి వర్యులు 'తిలక సహస్రము'ను చెప్పి స్వామివారి తిలక వర్ణనచే సంతృప్తినంది సంతుష్టులైనట్లు ప్రతీతి.

శ్లో 9 కిరీట వర్ణన- ధ్యానయోగ ప్రధానమైనట్టిది. దీనియందలి 'కుప్యచ్ఛ్రోశీ వచన కుటిల'- పదము దేశికులవారి ప్రత్యక్షమైన ఒక జీవితానుభవమును వ్యక్తము చేయుచున్నది.

దేశికులవారు ప్రప్రథమముగా శ్రీరంగమునకు వెళ్ళినప్పుడు పరిచితులు లేనందున ఒక గృహమందలి ఒక స్త్రీని కాసేపు తమ సామగ్రిని భద్రపరచుమని అడుగగా, ఆమె దేశికుల ప్రభావము తెలియనిదై కటువుగా మాట్లాడినదట. ఈ సన్నివేశ స్ఫురణమే 'కుప్యచ్చోళీ వచనకుటిల-' పదము. (చోళీ = చోళదేశ స్త్రీ)

పై విషయములను శ్రీమదాచార్యులవారు వ్యాఖ్యావిస్తృతి భీతిచే విసర్జించిరని భావింతును. వీరి వ్యాఖ్యానములో అనేక గ్రంథములనుండి యెన్నో ఉదాహరణములు బంగరునకు తావి యబ్బినట్లు చేరినవి.

ఒక కృతికి వ్యాఖ్యను నిర్మించుట యెంత శ్రమయో మల్లినాథసూరి తెల్పినారు, కవి హృదయము బాధపడని రీతి, బహు విషయ వివేచన, అంతర్నిగూఢ శబ్దార్థ గ్రహణ రీతి వ్యాఖ్యకు ప్రామాణికత్వ మొనగూర్చును ఆతితీ బోధాచరణ ప్రచారముల విద్యాపద్ధతిగల శ్రీమాన్ కే.వి. రాఘవాచార్యులు వయో భారమును గణింపక దేశికులవారు నిర్మించిన 'భగవద్ధ్యాన సోపానము' మనోరమ'ముగా వ్యాఖ్యానించి సహృదయ హృదయామోదమును కలిగించినారనుట స్వభావోక్తియే. శ్రియఃపతి ఆచార్యులవారిచే మరింత సాహితీ కైంకర్యమును చేయించుకోగలరని ప్రార్థన.

శుక్లచైత్ర నవమి,

శ్రీ రంగాచార్య

విన్నపం

దక్షిణ భారతదేశమందున్న 108 దివ్య తిరుపతులలో శ్రీరంగం ఉత్తమ పుణ్య క్షేత్రం.

ఇదం హిరంగం త్యజతా మిహాంగం
పునర్న చాంగం యదిచాంగ మేతి।
పాణౌరథాంగం శయనే భుజంగం
యానే విహంగం చరణేఒంబుగాంగమ్॥

శ్రీరంగంలో శరీరం విడిచినవారు మళ్ళీ శరీరాన్ని పొందలేరు. పొందవలసి ఉంటే, చేతిలో చక్రం, పడుకోవడానికి పాపతేడే సెజ్జ, గమనానికి గరుడ వాహనం, చరణం నుంచి చల్లగా జాలువారే గంగతో కూడిన శరీరమే వారు పొందుతారు.

పునర్జన్మ ఉండదు. భగవంతునితో సామ్యం పొందుతారని భావం. కాబట్టి,

"తెన్నాడుం వడనాడుం తొళునిన్ఱ తిరువరంగం తిరుప్పతి" దాక్షిణాత్యులూ, ఔత్తరాహులూ భజించే క్షేత్రం శ్రీరంగం అన్నారు శ్రీవిష్ణు చిత్తులు.

మనీషి నకార గుడికి దీర్ఘాన్ని నమ్రతగా తొలగించుకొని మనిషిగా మనుగడ సాగిస్తూ అత్యంతావశ్యక విషయాలను గ్రహిస్తున్నాడు.

1) చేతనం, అచేతనం, ఈశ్వరుడు-అనే మూడు విషయాలతో ఉండేది 'తత్త్వం' ఇది తెలుసుకోదగినది.

2) మోక్ష సాధనకు ఉపాయంగా ఉండేది 'హితం'. ఇది భక్తిప్రపత్తులతో అనుష్ఠించదగినది.

3) భగవంతునితో సమానమైన రూపం ధరించి, భగవంతుని సేవ చేస్తూ బ్రహ్మా
నందం పొందడమే 'పరమ పురుషార్థం' - మోక్షం. ఇది అనుభవించదగినదే.

"ఉరంగువాన్ పోల్‌యోగుశెయ్‌ద పెరుమాన్''
నిద్రిస్తున్నట్లు శయనించి జగద్రక్షణ చింతచేసే స్వామి శ్రీరంగనాథుడు.
"ఆరాత వరుళముతం పొదింద కోయిల్''

'భగవద్గుణానుభవమెంత చేసినా, ఇంక అనుభవించాలనే ఆశ పుట్టించే అమృతం లాంటి శ్రీరంగం'లో, శ్రీ వేదాన్త దేశికులవారు మనీషతో స్వామిని మొట్ట మొదట సేవించి, స్వామి దివ్యావయవ సౌందర్య ప్రవాహంలో మునకలు వేస్తుండగా, వాహినీ జనకమైన భగవచ్చరణమే, శరణమై, సోపాన ప్రాథమ్యాన్ని వహించి అత్యున్నత శిఖరాన్ని అధిరోహింపజేయడంవల్ల 'భగవద్ధ్యాన సోపానం' ప్రకటితమయి ఉంటుంది.

కాబట్టి, తత్త్వమేరిగి పరమ పురుషార్థాన్ని పొందడం కోసం 'భగవద్ధ్యాన సోపానం' చాల హితమైన స్తోత్రం.

దేశికుల కృపవల్ల ఈ స్తోత్రానికి యథామతి 'మనోరమా వ్యాఖ్యానం' రచించాను.

'భక్తి నివేదన' వేదాన్త మాసపత్రికా సంపాదకులూ, పాండితీపాథోనిధులూ, న్యాయ వేదాన్త విద్వాన్ శ్రీ డి. వే. శ్రీమాన్ తె. కం. గోపాలాచార్య స్వామివారు కటాక్షించి ఈ స్తోత్రంలోని మొదటి రెండు శ్లోకాలను సంగ్రహతాత్పర్యంతో 1987 జనవరి మాస పత్రికలో ప్రచురించారు. వారికి శతకోటి ప్రణామాలు.

అవ్యాజ ప్రేమతో 'మనోరమ'ను తిలకించి భగవద్ధ్యాన సోపానానికి 'రంగవల్లి'ని రచించిన మద్రాసు విశ్వవిద్యాలయం, వైష్ణవ శాఖాధ్యక్షులూ విశేష ధిషణా సంపన్నులూ డా॥ ముడుంబై నరసింహాచార్య స్వామివారికి,

కొన్ని తొడవులు తొడిగి 'సంవీక్ష' చేసిన విద్వద్విమర్శకులు పాలెం కళాశాల ఉపన్యాసకులు శ్రీమాన్ శ్రీరంగాచార్య స్వామివారికిని,

కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులర్పిస్తున్నాను.

ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ చేదోడువాదోడుగా నుండిన సుహృద్వరులు డా॥ కె. వి. ఆర్ గోపాలా చార్యులవారికి, డా॥ ఎస్. బి. రఘునాథాచార్యుల వారికిని హార్దికాభివాదాలు.

తమ విధులను నిర్వర్తిస్తూ నాకు సకల విధాలా సహకరించే అనుజులు

శ్రీ కె. పార్థసారథి స్వామి, బి.ఒ.ఎల్. పండిట్,

శ్రీ తిరుమల నరసింహచార్యులు, ఎమ్.ఏ. బి.ఎడ్.

డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులు, ఎమ్.ఎ.పి హెచ్.డి,

డా॥ తిరుమల వేంకట రమణాచార్యులు, ఎం.బి.బి.యస్., ఎం.ఎస్.

సదవకాశం కల్పిస్తూ ప్రోత్సాహపరచే పుత్రులు

చి॥ కె. వేంకట రమణాచార్యులు, I.A.S.

చి॥ కె. మనోహరాచార్యులు, M.Sc.

వీరందరికీ అభ్యుదయికాశీర్వాదాలు.

ఈ గ్రంథమునకై ధన సహాయం చేసిన తిరుమల-తిరుపతి దేవస్థానం వారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెల్పుకొంటున్నాను.

తీరిక చేసికొని ముద్రణ వ్యవహారాలను చూడ తోడ్పడిన మిత్రులు శ్రీ టి. వి. నరసింహులు గారికి, శ్రీ డి. కృష్ణ గారికిని ధన్యవాదాలు.

ఈ గ్రంథాన్ని చక్కగా ముద్రించి సకాలానికందజేసిన 'సఫైర్ ప్రింటింగ్ ప్రెస్సు' వారికి కృతజ్ఞతలు.

దోషజ్ఞులే అయినా, గుణగ్రాహులైన పాఠకోత్తములకు అంజలి ఘటిస్తున్నాను.

శుక్ల
జ్యేష్ఠ పౌర్ణమి.

బుధజన విధేయుడు,
కె. వి. రాఘవాచార్యులు

శ్రీమతే రామానుజాయ నమః
శ్రీనిగమాన్త మహాదేశికాయ నమః
శ్రీరంగనాథ పరబ్రహ్మణే నమః

భగవద్ధ్యాన సోపానమ్

పరిచయం

కవితార్కికసింహులు, సర్వతంత్ర స్వతంత్రులూ అయిన శ్రీమాన్ వేదాన్త దేశికులవారు రచించిన 'భగవద్ధ్యాన సోపానం' పరమభోగ్యమైనది. రచనా సౌందర్యం ప్రతిఫలించే ఈ స్తోత్రంలో ధ్యేయ దైవం శ్రీరంగనాథుడు మనస్సులో భగవంతుని రూపసౌందర్యం మందమందంగా ఆక్రాంతమయ్యే విషయం పాఠకులకే అనుభవమవుతుంది. ధ్యానపద్ధతిలో తొణకకుండా భావసౌందర్యాన్ని భద్రపరచుకున్న తొమ్మిది సోపానాలు- సాష్టాంగం- ఇందున్నవి.

ఆళ్వారాదులు నాయికాభావనతో ఉజ్జ్వలభక్తిరసప్రవాహానికి ఏతమెత్తారు. అట్లే శ్రీ దేశికులవారు కూడా ఈ శ్లోకాల్లో మధురభక్తినీ, కవితాశక్తినీ వ్యక్తం చేశారు.

ఇరవైనాలుగు ప్రబంధాల కూడలియైన దివ్యప్రబంధం "నాలాయిరం". అందులో తిరుప్పాణాళ్వార్లు పాడిన 'అమలనాదిపిరాన్' చాలా చిన్న ప్రబంధ పారిజాతం. దాని పరిమళానికి పరవశులై శ్రీమదాచార్యులవారు ఈ స్తోత్రాన్ని రచించారు. దివ్యావయవ సౌందర్యవిశిష్టులై లోకులను ముగ్ధపరచి "అళగియమణవాళ౯" అనే పేరుగాంచిన శ్రీరంగనాథుణ్ని ఆపాదమస్తకం మనసార ధ్యానించారు. దేశికులవారు తాము పొందిన అమందానందానుభవాన్ని మనం కూడా నిత్యం అనుసంధించి ఆనందించడానికి ఈ స్తోత్రాన్ని మన కనుగ్రహించారు.

శ్రీమాన్ వేంకటనాథార్యః కవితార్కిక కేసరీ ।
వేదాన్తాచార్య వర్యోమే సన్నిధత్తాం సదాహృది ॥

1. అంతర్జ్యోతిఃకిమపి యమినా మంజనం యోగదృష్టేః
చింతారత్నం సులభమిహన స్సిద్ధి మోక్షానురూపమ్ ।
దీనానాథవ్యసనశమనం దైవతం దైవతానాం
దివ్యంచక్షుః శ్రుతిపరిషదాం దృశ్యతేరంగమధ్యే ॥

ప్రతిపదార్థం :-

దైవతానాం = దేవతలయొక్క, దైవతం = దైవము, యోగదృష్టేః = ఏకాగ్రంగా చూచే కంటికి, అంజనం = కాటుక, యమినాం = యోగులయొక్క, అంతః = హృదయంలోని, జ్యోతిః = వెలుగు, దీన + అనాథ, వ్యసన, శమనం = పేదవారి, దిక్కులేనివారి కష్టాలను కడతేర్చేది. శ్రుతిపరిషదాం = వేదవ్యూహాలకు, దివ్యం = ప్రకాశించే, చక్షుః = కన్ను, సులభం = శ్రమలేకుండా లభించేది, చింతారత్నం = ధ్యానయోగ ద్రవ్యాలలో శ్రేష్ఠమైనది, మోక్ష + అనురూపం = భగవత్కైంకర్యానికి (ముక్తికి) తగినది, ఇహ = ఇక్కడ, నః = మనకు, సిద్ధి = పొందదగిన ఫలం, కిం + అపి = ఏదో చెప్పరాని పరమార్థం, రంగమధ్యే = శ్రీరంగక్షేత్రమందు, దృశ్యతే = కనబడుచున్నది.

తాత్పర్యం :-

బ్రహ్మరుద్రేంద్రాది దేవతలు పూజించే దేవదేవుడు శ్రీమన్నారాయణుడు. తనను దర్శించాలని తహతహపడే భక్తుల కంటికి అంజనం వంటివాడు. యోగుల యెదలో వెలిగేవాడు. దీనులనూ, అనాథులనూ కష్టాలనుంచి కడతేర్చువాడు. తన స్వరూప వైభవాన్ని తెలుసుకోవడానికి వేదశాస్త్రార్థాలను బోధించి జ్ఞాననేత్రాన్ని ప్రసాదించేవాడు. సౌలభ్యసౌశీల్యాదికల్యాణగుణపూర్ణుడు. తనను తలచినవారి కోరికల నీడేర్చే అనర్ఘరత్నం. ఈ లోకంలోనే తనను సేవించువారికి మోక్షానందాన్ని సిద్ధింపజేయడానికి అర్చారూపంతో వెలసిన శ్రియఃపతి శ్రీరంగక్షేత్రంలో దర్శనమిస్తూ ఉంటాడు.

వ్యాఖ్య :-

ఈ శ్లోకంలో దేశికులవారు ధ్యేయవస్తువును నిర్దేశించారు. స్వయంప్రకాశమాన మైన రూపమే ధ్యేయం. దీపం వెలిగేప్పుడు వత్తికి నూనె అందుతున్నట్లే భగవంతుని యందు నిరంతరం మనస్సు నిల్పడం ధ్యానం. ఇలా ఎంత కాలం? అంటే "సఖ ల్వేవం వర్తయన్ యావదాయుషం"- జీవితాంతం వరకు- అన్నది వేదం. "ఒళివిల్ కాలమెల్లాం"-'ఎడతెగకుండా ఎల్లకాలం పరమాత్మను సేవించడం జీవాత్మ స్వరూపం' అన్నారు నమ్మాళ్వార్లు.

దైవతం దైవతానాం- శ్రియఃపతి ఉభయ విభూతి నాయకుడు. దేవతలందరు ప్రకృతి మండలంలో ఉన్నవారే. శ్రియఃపతి ఆడే ఆటలో బ్రహ్మాదులు పాచికలవంటి వారే. పరిపక్వజ్ఞానమున్నా దేవతలకు మొదట సృష్టిరహస్యం పట్టుబడలేదు. "తందేవ తానాం పరమంచ దైవతం" అని శ్రుతి. దేవతలు పరవాసు దేవుణ్ని ప్రార్థించారు. అతని కటాక్షంవల్ల నియమితులై కృతార్థులైనారు. "అయర్వఱుమమరర్గళదిపతియవన వన్"- 'జ్ఞానపూర్ణులైన నిత్యసూరులకూ ప్రభువు' అని వకుళాభరణుల దివ్యవాణి- "దైవతం దేవతానాంచ"- దేవతలకు కూడా శ్రీ మహావిష్ణువే స్తోత్రపాత్రుడని భీష్ముడు ధర్మరాజుతో నన్నాడు.

సత్యలోకంలో నిత్యం పూజించడానికి బ్రహ్మదేవుడు ప్రార్థిస్తే పరవాసుదేవుడు తామరమొగ్గలా ఉన్న శ్రీరంగనాథుని విమానాన్ని ప్రసాదించాడన్న ఇతివృత్తం ఇక్కడ వ్యంగ్యం.

అంజనం యోగదృష్టేః- జీవాత్మభావం పరమాత్మయందు చేరడం యోగం దేహప్రాణాదులను అపేక్షించే చిత్తవృత్తిని నిరోధించి భక్తిరూపమైన శేముషితో భగ వంతుని దర్శించడం యోగదృష్టి. రహస్యనిధిని కనబరచేది అంజనం. యోగదృష్టికి తానే అంజనం, నిధి కూడా తానే. పరమాత్ముని దర్శన సమానాకారస్థితిని పొంద డానికి ఉపాయం పరమాత్మోపాసనయే. "పరిశుద్ధేన మనసా ఏకేనగ్రాహ్యః" - అని శ్రీ భగవద్రామానుజులు వివరించారు. "మనసి విలసతాజ్ఞభక్తి సిద్ధాంజనేన"- అని శ్రీ పరాశరభట్టర్ సూక్తి.

సనకసనందన సనత్సుజాత సనత్కుమారాది మునులు యోగదృష్టిచే దర్శించిన వ్యూహవైభవం ఇక్కడ వ్యంజితం.

యమినా మంతర్జ్యోతిః- శ్రియఃపతి పరమపదమందు ఉండడానికంటే, వేరే ప్రయోజనం ఆపేక్షింపక యమనియమాదులను పాటిస్తూ నిరంతరం తనను ధ్యానించే వరమయోగుల హృదయంలో నివసించడానికి ఆశపడి పరంజ్యోతిగా ప్రకాశిస్తుంటాడు. ''నారాయణః పరంజ్యోతిః''- అని శ్రుతి.

''యేఽనన్య మనసశ్శుద్ధాః యేదాస్యైకమనోరథాః ।
తేషాంమే హృదయం విష్ణోః వైకుంఠాత్పరమంపదమ్ ॥''

భగవంతుడు సర్వాంతర్యామి. అయినా భగవద్భక్తిలేనివారి హృదయాల్లో ముళ్లమీద ఉన్నట్లు అతికష్టంగా నుంటాడన్నది బ్రహ్మాండ పురాణం.

''భగవచ్చరణ ద్వంద్వే భక్తిర్యేషాంన విద్యతే ।
తేషాం హృదిస్థితో దేవః కంటకాగ్ర ఇవస్థితః ॥''

ఇక్కడ సర్వాంతర్యామి స్వరూపమూ; ''యోగేనాంతే తనుత్యజామ్''- చివరకు యోగంతో దేహాన్ని వదలిపెట్టిన ఇక్ష్వాకు ప్రభువు మొదలైన సూర్యవంశపు రాజుల సౌహార్దమూ సూచితం.

దీనానాథ వ్యసనశమనం- భగవంతుడు దీనుల బాధలను బాపి వారిని ఆదుకుంటాడు. ''దీనాన్ దానేన రాఘవః'' - త్రిజటుడు మొదలైనవారికెందరికో కోరిన పదార్థాలనిచ్చి శ్రీరాముడు తృప్తిపరచాడని వాల్మీకి వాక్కు. శత్రుసోదరుడైనా శరణాగతి చేసిన విభీషణునికి, తత్కాలాననే, పట్టం కట్టడమే కాదు, ఆ సమయాన్ని సార్థకం చేస్తూ, ''ఒక్కసారి ప్రపత్తిచేస్తే చాలు, సర్వభూతాలకూ అభయమిస్తున్నాను'' అని తన సౌశీల్యాన్ని గంభీరంగా ప్రకటించిన సువ్రతుడు రాఘవుడు.

దిక్కూ - చిక్కీలేనివారి మొక్కు గ్రక్కున దీర్చినవాడు శ్రీకృష్ణుడు - ''కలక్కవేళ్ కడలేళ్ మలై ఉలగేళుమ్కళియక్కడాయ్ ఉలక్కత్తేర్ కొడుశెన్ఱ మాయముమ్''- అని దివ్యసూరిశ్రీ సూక్తి.

ఒక బాపని భార్యకు క్రమంగా ముగ్గురు కొడుకులు పుట్టిన వెంటనే చనిపో యారు. నాల్గవ కాన్పునైనా మాకు దక్కించుమని బాపడు శ్రీకృష్ణుణ్ని ప్రార్థించాడు. యజ్ఞదీక్షితుడైన శ్రీకృష్ణుడు మరునాడుకాని రాజాలకుండెను. అంతలో 'నీ బిడ్డణ్ని నేను రక్షిస్తాను' అనీ అర్జునుడు వచ్చి ఆ బాపని యింటిచుట్టూ యముడు చొరకుండా బాణాలకోట కట్టాడు. అయినా పుత్రుడు పుట్టాడూ- గిట్టాడు. మళ్ళీ యేడుస్తూ వచ్చిన ఆ భూసురుణ్ని శ్రీకృష్ణుడు బుజ్జగించాడు. అర్జునునితోబాటు అతణ్ని తన రథంమీద నెక్కించుకొని బయల్దేరాడు. ఏడు జలధులను, ఏడు ధరాధరాలనూ దాటి రథం ప్రకృతి మండలం చివర పెనుచీకట్లో సాగక ఆగింది. శ్రీకృష్ణుని మహిమచే విక్రమక్రమణ చక్రక్రీడ శోభించింది. ఆ వెలుగులో వారిని అక్కడే నిల్పి, శ్రీకృష్ణుడొక్కడే జ్యోతి ర్మండలంలో ప్రవేశించాడు. వైకుంఠంలో దేవేరులు తమవద్ద బాపని కుమారుల నుంచు కొని, శ్రీకృష్ణుని దివ్యసౌందర్యాన్ని చూడగోరి ఆయనను రప్పించారు. కాబట్టి శ్రీకృష్ణుడు వారి కోరికనూ తీర్చాడు. విప్రదంపతుల కానందగ్రంధులైన శిశువుల నలుగురినీ తెచ్చి అర్పించాడు.

అఘటితఘటనా సామర్థ్యాన్ని ప్రదర్శించింది విభవావతారమనీ, శ్రీరాముడు తమ ఇలువేల్పు అయిన శ్రీరంగనాథుని విమానాన్ని విభీషణునికి కానుకగా నర్పించి, "ఇక్ష్వాకూణాంకుల ధనమాత్మనోఽభ్యధికంతదా। శ్రీమద్రంగం మహద్ధామ"- అని శ్రీరంగ మహత్వాన్ని తెల్పినాడనీ ఈ పదం సూచిస్తుంది :

దివ్యం చక్షుః శ్రుతిపరిషదాం- వేదాన్ని శ్రుతి అంటారు. శ్రుత్యర్థాన్ని నేత్ర మంటారు. 'వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః'- అని శ్రుతి. "సర్వస్యలోచనం శాస్త్రం" అని ఆ చాణకం. ఈ శ్రుత్యర్థం భగవంతుని స్వరూపాన్నీ, స్వభావాన్నీ బోధిస్తుంది. "శుద్ధం చక్షుః శ్రుతిపరిషదాం"- అని హంస సందేశం. శ్రియఃపతి ఆడే పాచికలాటకు ప్రేక్షకులు వేదాలూ, నిత్యసూరులూను. 'పశ్యంతీషు శ్రుతిషు పరితః సూరిబృందేనసార్థం' అని దేశికులవారి శ్రీస్తుతి.

భగవంతునికి సర్వస్వం అర్పించి శరణాగతి చేయాలన్నది వేదం. "తం పత్నీ భిరనుగచ్ఛేమదేవాః, పుత్రైర్భ్రాతృభిరుతవాహిరణ్యైః। నాకం గృహ్ణానా సుకృతస్య లోకే, తృతీయేపృష్ఠేఽధిరోచనేన॥" "స్వర్గలోకానికి పైన దివ్యకాంతులతో వెలిగే

త్రిపాద్విభూతిలో ఉండే ఓ పరంధాముడా! నీ సన్నిధిని జేరడానికి సతీసుతసోదరుల తోనూ, సకల సంపదలతోనూ నిన్నే శరణు పొందుతున్నాం". శ్రుతులు ప్రకృతికంటె పరుడైన జీవునికంటెను పరుడైన పురుషుడు సహస్రశీర్షుడనీ, సహస్రాక్షుడనీ, సహస్రపాదుడనీ చెబుతున్నాయి- "రూపం రూపం ప్రతిరూపోబభూవ"- "ఏకస్సన్ బహుధా విచారః"-

ఈ బుక్కులన్నీ పరమాత్ముడు స్వేచ్ఛగా వివిధ రూపాలను ధరిస్తాడనీ, ఒక్కడే అయినా అనేక రీతుల చరిస్తాడనీ- ప్రత్యక్షంగా చూస్తున్నాయి. కాబట్టి "ఏహి, అశ్మానమాతిష్ఠ । అశ్మాభవతుతే తను"- ఓ దేవా! రమ్ము- శిలానిర్మితమైన ఈ ప్రతిమయందు ఉండుము. ఈ శిలయే నీ ధ్రువమూర్తి"- అని భక్తులు ఆశ్రయించి ఆరాధించడానికి అనువైన అర్చా విగ్రహాన్ని, కళాన్యాసంచేసి, శ్రుతి ప్రతిష్ఠిస్తుంది. "తమరుకన్ద దెవ్వురువు మవ్వురువన్నానే"- ఆశ్రితుల కిష్టమైన స్వర్ణరజితాది ద్రవ్యాన్నే తన శరీరంగా పరిగ్రహిస్తాడని పొయికైయాళ్వార్ల శ్రీసూక్తి.

"గవాం సర్వాంగజంక్షీరం స్రవేత్ స్తనముఖాద్యథా ।
తథా సర్వగతోదేవః ప్రతిమాదిషురాజతే ॥"

మనకు శక్తినిచ్చే పాలు ఆవు శరీరమంతట ఉన్నప్పటికీ అవి పొదుగునుంచే వస్తాయి. అట్లే పరమాత్ముని శక్తి సర్వత్ర వ్యాపించియున్నా ఆధారశక్తి అర్చామూర్తి నుంచే కలుగుతుంది.

అర్చావిగ్రహమందే గుణపూర్తి ఉంది. "తస్య నామ మహద్యశః". ఆయన నామ సంకీర్తనం గొప్ప పురుషార్థసాధకమన్నది వేదం. భగవంతుని ధ్యానించేప్పుడు కోతి జ్ఞాపకానికి వస్తే బాగుంటుందా? కాబట్టి అందమూ, ఆనందమూ అమరియున్న అర్చామూర్తిని ఆశ్రయించి సేవిస్తూ ధ్యానం చేయడం సులభం. అనాయాసంగా ఉపాసించే వీలుంది. తలపుల పంటయై ఉల్లమును రంజిల్లజేసే అనర్ఘరత్నం. "నాన్యోతోస్తిమంతా"- ఇతనికన్న మరొకడు జగద్వ్యాపారాన్ని గూర్చి ఆలోచించేవాడు లేడన్నది వేదం. కాబట్టి శ్రీమన్నారాయణుడే చింతారత్నం "యమేవైషవృణుతే తేన లభ్యః" ప్రీతిపూర్వకంగా ధ్యానిస్తే పరమాత్ముని దయ ప్రవహిస్తుంది. ప్రకృతి బంధాలు పటాపంచలౌతాయి. మోక్షమంటే శ్రియఃపతి పాదారవింద సేవా సౌభాగ్యమే.

"సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా ।"- జగన్నిర్మాణాది కార్యాలు తప్ప ముక్తాత్మ పరమాత్మతో కల్యాణగుణాల ననుభవిస్తాడు. ఆనందిస్తాడు. పరమ పదం పోయి చేసే కైంకర్యం ప్రపంచంలోనే లభిస్తుందన్న అధ్యవసాయం, నిష్ఠ,- గోవింద పదారవింద పదవీ పరిణద్ధగరిష్ఠచిత్తుల కుంటుంది.

"సంసార ఏవభగవన్నపవర్గఏవ"- నీ అనుగ్రహముంటే, నీ సన్నిధినుంటే, నీమీద అనన్యభక్తి ఉంటే, నీ దాసజన సహవాసముంటే ఈ సంసారం వైకుంఠం కాదా? అన్నారు దేశికులవారు. కాబట్టి అర్చారూపమే 'మోక్షానురూపం'.

శ్రీనాథుని దివ్యమంగళవిగ్రహాన్ని మానవుడు ఆశ్రయించి, ఆరాధించి, ఈ లోకంలోనే భగవత్ప్రాప్తిరూపమైన సిద్ధిని పొందుతాడన్నది గీత.

"స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః".
కంసారి చరణకమల పరిభజనమే సంసారంలో సారం.

కిమపి దృశ్యతే రంగమధ్యే- పరమా? వ్యూహమా? ఇదీ, అదీ అని చెప్ప రానిది. "ఆద్యం స్వయం వ్యక్తమిదం విమానం రంగ సంజ్ఞితం"- రంగమనే పేరు కల్గిన విమానం స్వయంవ్యక్తమే. శ్రీమన్నారాయణుడు దీన్ని చతుర్ముఖబ్రహ్మకు ఇచ్చాడు. అక్కడినుండే అయోధ్యకు చేరింది. ఇక్ష్వాకూణాంకుల ధనమిదం రంగతాం యాతి రంగం"- అని సంకల్ప సూర్యోదయంలో దేశికులవారన్నారు.

"అనన్తపీఠే శ్రీరంగం స్థాపయామాస రాక్షసః" - అయోధ్యనుంచి విభీషణుడు తెచ్చి శ్రీరంగవిమానాన్ని శేషపీఠంమీద స్థాపించాడు. కాబట్టి బ్రహ్మాదిదేవతలూ, సప్తర్షులూ, ఆళ్వార్లూ, ఆచార్యులూ వైకుంఠం నుంచి స్వేచ్ఛగా వచ్చి నిల్చిన జగన్నాటక సూత్రధారిని పూజించారు. కావేరి విరజానదియే. శ్రీరంగం వైకుంఠమే. మంజూషలో మరకతమణిలా, సకలజన, మనోనయనానందకరంగా ప్రకాశిస్తూ (నాటక) రంగములో దర్శనమిస్తున్నాడు శ్రీరంగనాథుడు.

శబ్దశక్తి మూలకధ్వని గర్భితమయిన శ్లోక మిది.

2. వేలాతీతశ్రుతిపరిమళం వేధసాం మౌళిసేవ్యమ్,
ప్రాదుర్భూతం కనకసరితః సైకతే హంసజుష్టే ।
లక్ష్మీభూమ్యోః కరసరసిజై ర్లాలితం రంగభర్తుః,
పాదాంభోజం ప్రతిఫలతి మే భావనాదీర్ఘికాయామ్ ॥

ప్రతిపదార్థం :-

వేలా + అతీత, శ్రుతి పరిమళం = వేలాతీత = (మితిమీరిన) అపారమైన; శ్రుతి పరిమళం = (చెవికి ఇంపైన); వేదములందు పరిమళించునట్టి; వేధసాం = బ్రహ్మల యొక్క; మౌళిసేవ్యం = తలలచే సేవించదగినట్టి; హంసజుష్టే = పరమ హంసలచే సేవింపబడిన; కనక సరితః = కావేరీనదియొక్క; సైకతే = ఇసుకదిన్నెయందు; ప్రాదుర్భూతం = ఉదయించినట్టి; లక్ష్మీభూమ్యోః = శ్రీభూదేవులయొక్క; కరసరసిజైః = కేల్దామరలచేత; లాలితం మెత్తగా నొత్తబడినట్టి; రంగభర్తుః = శ్రీరంగనాథుని; పాద + అంభోజం = పాదకమలము; మే = నాయొక్క; భావనాదీర్ఘికాయాం = హృదయమనెడి సరస్సునందు: ప్రతిఫలతి = ప్రతిబింబించుచున్నది.

తాత్పర్యం :-

పారమెరుగరాని వేదాలలో పరిమళించేవి; బ్రహ్మలు తలలు వంచి సేవింపదగినవి; పరమహంసలు పరివేష్టితులై సేవిస్తున్నప్పుడు కావేరి ఇసుక దిన్నెమీద ఉప్పతిల్లి కానవచ్చేవి; శ్రీభూదేవుల పాణిపద్మములచే అతిమృదువుగా నొత్తబడుచుండే శ్రీరంగపతి పాదకమలాలు నా హృదయ సరస్సులో ప్రతిఫలిస్తున్నాయి.

వ్యాఖ్య :-

భగవద్ధ్యాన సోపానాలలో మొదటిది తత్పాదారవిందం. దేశికులవారి హృదయమే జలాశయం. అందు ప్రతిఫలించేవి శ్రీరంగనాథుని పాదకమలాలు.

వేలాతీత శ్రుతిపరిమళం- ప్రకృతిలోని కమలాలు కాలానికి కట్టుబడి వికసించి వాడిపోతాయి. భగవంతుని పాదకమలాలు వాడకుండా ఎల్లవేళల వికాసంగా నుంటూ తావులను విరజిమ్ముతుంటాయి. వాసన జూచేది ఘ్రాణేంద్రియమే కాని శ్రవణేంద్రియం

కాదు కదా! కాబట్టి శ్రవణసుభగమైన వేదాలలో భగవత్పాదకమలాలు పరిమళించడం నైసర్గికం. ''విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః'' అని శ్రుతి.

వేదాలకూ మితిలేదు. ''అనంతావై వేదాః.'' సర్వేశ్వరుణ్ని ఉపనిషత్తులు ''సర్వగంధః; సర్వరసః''- అని చెబుతున్నాయి.

''ఆమోదితోఽపినిగమైర్విభు రంఘ్రియుగ్మే'' - జగన్నాథుని పాదపద్మాలు వైదిక పరిమళంతో గుభాళించేవి - అని దేశికులవారి గోదాస్తుతి. వేదం ప్రమాణం, భగవంతుని పాదయుగ్మం ప్రమేయం. కాబట్టి భగవత్పాదకమలాలు వేదనాదామోదితాలు. మరొక విషయం-

''భూయోఽపిభాగవత శేషతయాతదేవ, వ్యంక్తుం పదావని! శఠారిపదంబిభర్షి'' (పాదుకా సహస్రం)

ద్రావిడవేదంలో శేషశేషిభావాన్ని, స్వస్వామి సంబంధాన్ని విశదపరచిన శఠగోపనామాంచితులు- నమ్మాళ్వార్లు భగవత్పాదస్వరూపులే- అని కవికేసరి హృదయం.

''యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై'' అని శ్రుతి పలికినట్లు వేదం భగవన్ముఖోదితమైనది. ద్రావిడ వేదనాదం భగవత్పాదాం భోజంనుంచి ఆవిర్భవించినది.

వేలా + అతీత = చెలియలికట్ట దాటినట్టిది- అనగా, హద్దులేనిదని అర్థం సంస్కృతవేదం మట్టికుండలాంటిదనీ, ద్రావిడవేదం ''(పొఱ్కుడమ్)'' బంగారుకుండ లాంటిదని పూర్వాచార్యుల సూక్తి. సంస్కృతవేదాన్ని అధ్యయనం చేయడం కొందఱికే పరిమితమయింది. కాని, ద్రావిడవేదాన్ని మగువలూ- మగవారూ, అందరు చదువవచ్చును, వినవచ్చును కూడ. కొందరికే అన్న నియమంలేదు. కాబట్టి ద్రావిడ వేద సాగరం ''వేలాతీతం'' కదా! అందులో ప్రకాశించేవీ, పరిమళించేవీ ''తుయరఱు శుడరడి''- దుఃఖాన్ని దూరంచేసే దివ్యశ్రీపాదకమలాలే- అని ''వేలాతీతశ్రుతిపరిమళం''- అనే దళానికి అర్థం.

వేధసాం మౌళిసేవ్యం- ప్రతి సృష్ట్యాదిలో శ్రీమన్నారాయణుని నాభికమలం ఒక బ్రహ్మకు జన్మనిస్తుంది. ''హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే'' అని శ్రుతి. ప్రతి

బ్రహ్మ భగవత్పాదకమలాలను పూజించి శిరసావహిస్తాడు. "ధాతాయథాపూర్వ మకల్ప యత్"- సృజనక్రియాకలాపం ఎప్పటివలెనే జరుగుతుంది. కాబట్టి కమలాసనులందరు చేసే కైంకర్యాన్ని స్వీకరించే యోగ్యత భగవంతుని శ్రీపాదకమలాలకు మాత్రమే ఉంది.

"కమపి కనకసింధోః సైకతే సంచరంతం"- శ్రీరంగరాజు అప్పుడప్పుడు కావేరి యిసుకదిన్నెలమీద సంచరిస్తాడు. అస్పృష్టసంసారగంధులైన నిత్యసూరులు, పరమహంసలు శ్రీరంగేశుని సైకత విహారానందాన్ని కన్నారజూచి, మనసార అనుభవించి తన్మయులౌతారు. కావేరీ నదీలలామ నీటికెరటాల రూపంలో శ్రీరంగపతి పాద కమలాలను కమనీయంగా లాలించి, ముద్దాడి, మురిసిపోతుంది- అని కులశేఖరాళ్వార్ల శ్రీసూక్తి.

ప్రాకృతికంగా కమలాలకు కమలాలతో రాపిడి జరుగుతుందే కాని మృదువుగా లాలన జరుగదు కదా! ఇచ్చట లక్ష్మీ భూదేవు లిర్వురు పరిమళించే తమ పాణి పద్మాలతో సుతిమెత్తగా శ్రీరంగనాథుని పాదపద్మాలను ఒత్తుతుంటారు.

"మలర్మగళ్ కైవరుడ్ మలర్ పోనిల్‌కి లన్హన". లక్ష్మీదేవి ఎంతో మృదువుగా స్పృశించినా సుకుమారమైన భగవంతుని పాదకమలాలు కందిపోతుంటాయట.

"పద్మాధాత్రీకరాభ్యాం పరిచితచరణం" - అని శ్రీ పరాశరభట్టర్ సూక్తి ప్రకారం దేశికులు శ్రీభూదేవులు రంగనాథుని పాదసంవహనం చేస్తున్న దృశ్యాన్ని తిలకించి మనసార ధ్యానం చేస్తున్నారు.

"తిరుక్కమలపాదజ్ఞళ్ వన్దెన్‌కణ్ణి నుళ్ళనవొక్కిన్హదే"- తిరుప్పాణాళ్వార్ తమ భౌతిక చర్మచక్షువులతో భగవంతుని చరణసరసిజాలను సేవించారు. కాని, దేశికుల వారు తమ ధ్యానంలో మనోనేత్రంతో తిలకించారు. లోతైన, కదలని, తేటనీటిలోగాని వస్తువు ప్రతిబింబించదు కదా! కాబట్టి గంభీరమై, నిశ్చలమై, స్వచ్ఛమైన దేశికులవారి హృదయసరోవరంలో శ్రీరంగనాథుని పాదకమలాలు ప్రతిఫలించడం నిశ్చలధ్యాన మగ్నతకు నిదర్శనం. సంసారులకు కంసారిచరణయుగళమే శరణము కదా!!

3. చిత్రాకారాం కటకరుచిభిశ్చారు వృత్తానుపూర్వాం
కాలే దూత్యద్రుత తరగతిం కాంతిలీలాకలాచీమ్ ।
జానుచ్ఛాయా ద్విగుణసుభగాం రంగభర్తుర్మదాత్మా
జంఘాం దృష్ట్వా జననపదవీజాంఘికత్వం జహాతి ॥

అర్థము :-

కటకరుచిభిః = కడియాల కాంతులచేత; చిత్రాకారాం = మనోహరమైన ఆకృతి కలిగినట్టి; చారువృత్త + అనుపూర్వాం = మీదినుండి క్రిందివరకు ముందువెనుక భాగములు కూడ అందముగా, గుండ్రముగా నమరియున్నట్టి; కాంతి, లీలా, కలాచీమ్ = కాంతి విలాసములకు తమ్మపడిగవంటివైనట్టి; కాలే = ఒకానొక సమయమున; దూత్య, ద్రుతతర, గతిం = దూతకృత్యమునకై మిక్కిలి శీఘ్రగమనము కలిగినట్టి; జాను, ఛాయా, ద్విగుణ, సుభగాం = మోకాళ్ళ కాంతులచే రెట్టింపు సౌబగు కలిగినట్టి; రంగ భర్తుః = శ్రీరంగపతియొక్క; జంఘాం = పిక్కలను; మత్ + ఆత్మా = నా మనస్సు; దృష్ట్వా = చూచి; జనన, పదవీ జాంఘికత్వం = పుట్టుకత్రోపలోని పరుగుదలను; జహాతి = వదలుకొనుచున్నది.

తాత్పర్యము :-

కడియాల కాంతులచే దిద్దితీర్చిన వృత్తంలా చిత్రమైన ఆకారమూ, జానువుల శోభచే రెట్టింపు సోయగమూ కలిగి, ఒకప్పుడు రాయబారానికి అతిశీఘ్రంగా నడక సాగించి, కాంతివిలాసాలను పుక్కిలించినట్లున్న శ్రీరంగనాథుని పిక్కల చక్కదనాన్ని మక్కువతో సేవించి నా మనస్సు ఇక జన్మమెత్తకుండా సంసారపు బాటలో పరుగెత్తడం మానుకున్నది.

వ్యాఖ్య :-

శ్రీరంగనాథుని జంఘలను ధ్యానించే శ్లోకమిది. 'వీరక్కళల్' అంటే వీరులు ధరించే కడియాలు శ్రీరంగనాథుని కాళ్ళకు అలంకారాలుగా ఉన్నాయి. ఆ గండపెండెరాల కాంతులెగజిమ్మడంవల్ల పిక్కలు చిక్కని చక్కదనంతో చొక్కుతున్నాయి. పైన లావుగానూ, దిగువ సన్నగానూ తమ్మపడిగ-కళాచి-లా వర్తులాకారంగా నుండడం

వల్ల అందచందాలకు ఆశ్రయాలైనాయి. చీలమండల్లో చిందులాడే సిరులతో మోకాళ్ళ సౌరు తాకట్టు పెట్టుకోవడంవల్ల శ్రీరంగపతి జంఘల సౌందర్యం రెట్టింపై, చూపరుల పాపాలను నెట్టివేస్తున్నాయి. కాబట్టి, చిరంగా, స్థిరంగా చూచే భక్తులకు భగవంతుని ఆ అవయవశక్తిని స్మరించే ఆసక్తిని జనింప చేస్తున్నాయి. ఆహా! ఇవి పిక్కలా? కావు. కొబ్బరివక్కలు.

శ్రీకృష్ణుడు పాండవులకు దూత కదా! దూతకృత్యంగా పరుగెత్తడం కోసం ఈ పిక్కబలమే కదా సాయపడింది. యోగనిద్రాముద్రాభిరాముడైన శ్రీరంగశాయి జంఘలను సేవిస్తుంటే ఇప్పటికీ రాయబారియైన శ్రీకృష్ణుని పిక్కబలం స్ఫుటంగా గోచరిస్తున్నది. అంతేకాదు; అనాదినుంచి అనేక జన్మలెత్తుతూ ప్రాపంచిక వ్యవహార మార్గంలో పరుగులుదీసే సంసారుల పిక్కబలం బిక్కపోతున్నది. భక్తులు జన్మరాహిత్యంవల్ల ముక్తపురుషులవుతున్నారు.

దేశికులవారికి అర్చామూర్తి సౌందర్యం తిలకించేసరికి విభవావతార వైభవం స్ఫురించింది. సర్వేశ్వరుని జంఘలను ఈ జన్మలో ధ్యానించడంవల్ల తన జనన పదవీ జాంఘికత్వం పంచబంగాళ మయిందన్నారు.

కవితార్కిక కేసరి కవిత్వంలో విరోధమెంత ఆభాసించి, అంత్యపురుషార్థం ఎంత కమనీయమయిందో గమనీయమే.

"దూత్యప్రసంగోత్సుకం."- దూతకృత్యానికి పంపబడే విషయానికే భగవంతుని పాదాలు సర్వదా ఉత్సాహపడుతుంటాయి- అని శ్రీపరాశరభట్టర్ సూక్తి.

"అరంగత్తరవినదైయా నన్దిపోల్ నిఱత్తు ఆడైయుమ్" - సంజకెంజాయవలె అభిరామమైన శ్రీరంగనాథుని పీతాంబరంపైన మాత్రమే తిరుప్పాణాళ్వారుల దృష్టి పడినది. కాని "మనోఽస్య దైవంచక్షుః"- అనే శ్రుతిరీత్యా దేశికులవారు దివ్యభవ్య దృష్టితో శ్రీరంగేశుని జంఘలనూ, జానువులనూ, ఊరువులను కూడా చిత్తగించారు.

4. కామారామస్థిరకదళికాస్తంభ సంభావనీయం
క్షేమాశ్లిష్టం కిమపికమలా భూమినీళోపధానమ్ ।
న్యంచత్కాంచీకిరణరుచిరం నిర్విశత్యూరుయుగ్మం
లావణ్యౌఘద్వయమివమతి ర్మామికారంగయూనః ॥

అర్థము :-

కామా-నీయం । కామ = మన్మథుని; ఆరామ = తోటలోని; స్థిర = కదలని (శాశ్వతమైన); కదళికా = అరటి; స్తంభ = కాండములోయని; సంభావనీయం = ఊహింపదగినట్టి; క్షౌమ + ఆశ్లిష్టం = పీతాంబరముచే కౌగిలింపబడిన; కిమపి = సుఖకరమైన; కమలా. భూమి, నీళా + ఉపధానం = శ్రీ భూ నీళాసతులకు దిండ్లుగా నున్నట్టి; న్యంచత్, కాంచీ, కిరణ, రుచిరం = జారుచున్న మొలత్రాటి (మణుల) కాంతికిరణములచే ప్రకాశించునట్టి; లావణ్య + ఓఘద్వయం + ఇవ = సౌందర్యము యొక్క రెండు ప్రవాహములో అన్నట్లున్న; రంగయూనః = శ్రీరంగనాథుడనే పేరు గల యువకునియొక్క; ఊరుయుగ్మం = తొడలజంటను; మామికా = నాదైన; మతిః = బుద్ధి; నిర్విశతి = చేరుచున్నది.

తాత్పర్యము :-

వలరాజు సింగారపు తోటలో కలకాలం శోభించే కదళీస్తంభాలనదగినవై, పీతాంబరంతో ఒదిగియున్నవై, శ్రీభూనీళాపిరాట్టులకు తలగడ దిండ్లుగా అమరినవై, జారుతున్న మొలత్రాటి మణులకాంతులతో నిగనిగలాడుతూ, లావణ్యరాశి రెండు పాయలైనట్లున్న శ్రీరంగయువకుని ఊరువుల్లోకి నా మనస్సు చొరవతో చేరుతున్నది.

వ్యాఖ్య :-

శ్రీరంగేశుని ఊరువులను ధ్యానించే శ్లోకమిది.

ప్రకృతిలో అరటిబోదెలు కొద్దికాలమే నిగనిగలాడి నశిస్తాయి. కాని శ్రీరంగ దేవుని ఊరువులు-తొడలు- మన్మథుని శృంగారోద్యాన వనంలో నిశ్చలంగా నిత్యమూ నిగనిగలాడే అరటిస్తంభాలే అని ఉత్ప్రేక్ష.

లంకలోనున్న సీతమ్మ మారుతిని శ్రీరాముని లెంకగా నమ్మడానికి "కథ మూరూ? కథంబాహూ?"- శ్రీరాముని తొడలు, చేతులూ, ఎట్లుంటాయి? అని అడిగింది. బాహిరంగా ఉండే బాహువులను ఎవరైనా చూడవచ్చు. కానీ, రామదూతయే అయినట్లయితే ఒడలు కంటుకొనియున్న కట్టుపుట్టము మఱుగున నుండే తొడలను

సైతం తెలుసుకొని ఉంటాడు. తాను తెలుసుకున్నా, స్త్రీయైన తనతో ఔచిత్యమెరుగక మాటలాడదని సీతమ్మ భావించియే హనుమంతుణ్ణి ప్రశ్నించింది కదా!

కాబట్టి, ఆచార్యుడు భగవత్తత్త్వం సమగ్రంగా, సరహస్యంగా తెలుసుకొని, ఇతరులకు సముచితంగా తెల్పవలెనని దీనివల్ల తెల్లమవుతున్నది. భగవంతుని బాహువులు ఎలా బలనికేతనాలో, అలా తొడలు కూడా సౌందర్యేందిరామందిరాలు. పురుషుల దృష్టి చిత్తాప (చిత్ + తాప) హారకమైన శ్రియఃపతి యూరువుల సౌందర్యాన్ని తన్మయమై ధ్యానించే దేశికుల మనస్సు, వనితాజనతా మనస్సుమనస్సులా సమ్మోహిత మయింది. కాబట్టి, మధురభక్తిచే భాషాయోషలాస్యం చేసింది.

"స్రగ్వస్త్రాభరణైర్యుక్తం స్వానురూపై రనూపమైః ।
చిన్మయైః స్వప్రకాశైశ్చ స్వాన్యోన్య రుచిరంజకైః ॥"

పుష్పమాలాభరణాదులన్నీ భగవంతుని కైంకర్యంకోసం అహమహమికాపేక్షతో అహరహమూ తహతహలాడే చేతనకోటిలో జేరినవే. కాబట్టి పీతాంబరం కూడా అత్యాసక్తితో శ్రీరంగశాయి ఊరువులను ఆశ్లేషించింది. అలంకారమేకాక, అంగాలింగనాలింగితం క్షౌమం. ఇది సౌభాగ్య గరిమా పరిపాకానికి సంకేతం. శ్రీదేవి, భూదేవి, నీళాదేవి కూడా శ్రియఃపతి యూరువులను తమ తలగడ దిండ్లుగా చేసుకొని అవ్యక్త మధురానందానుభూతిని పొందుతుంటారు. లక్ష్మీదేవిలా శ్రీమన్నారాయణునికి భూదేవి, నీళాదేవి కూడా దివ్యపత్నులే. శ్రీదేవికి భూనీళలు చేతనోజ్జీవన విషయంలో చేదోడు వాదోడుగా నుంటారు.

న్యంచత్ కాంచీకిరణరుచిరం– శ్రీరంగనాథస్వామి ఊరువులు సహజంగా అందమయినవి. పైగా, నడుముకున్న తొడవు అంటే బంగారు మొలత్రాడు, అందు పొసగియున్న రంగురంగుల రత్నాలకాంతులు క్రిందికి ప్రసరించడంవల్ల తొడల అందం మరెంతో హెచ్చింది.

"అచింత్య దివ్యాద్భుత నిత్యయౌవన స్వభావ లావణ్యమయామృత సాగరం" అని శ్రీ భగవద్రామానుజులవారు శ్రీవైకుంఠగద్యలో చెప్పినట్లూ శ్రీరంగేశుడు నిత్యయౌవనంతో స్పృహణీయుడు. కాబట్టి, ఆ దివ్యమంగళమూర్తి లావణ్యం రెండు

పాయలై ప్రవహించిందో అన్నట్లు శోభించే స్వామి ఊరువులందు దేశికులవారి మనస్సు చేరిపోయింది.

"తస్యధీరాః పరిజానంతి యోనిం"- అన్నది వేదవాక్కు. ఆ జగన్మోహనాకారుని స్వరూపాన్ని గరీయః ప్రతిభాసంపన్నులు మాత్రమే గమనించి తురీయపురుషార్థాన్ని సాధిస్తారు.

5. సంప్రీణాతి ప్రతికల మసౌ మానసం మే సుజాతా
గంభీరత్వాత్ క్వచన సమయే గూఢనిక్షిప్త విశ్వా ।
నాళీకేన స్ఫురితరజసా వేధసో నిర్మిమాణా
రమ్యావర్తద్యుతి సహచరీ రంగనాథస్యనాభిః ॥

అర్థము :-

సుజాతా = శోభాయమానంగా శరీర మధ్యభాగమున ఉన్నట్టి; గంభీరత్వాత్ = లోతైనదగుట వలన; క్వచన సమయే = ఒకానొక (ప్రళయ) సమయమున; గూఢ, నిక్షిప్త, విశ్వా = రహస్యముగా దాచబడిన విశ్వము కలిగినట్టి; నాళీకేన = తామరపూవు దైన; స్ఫురిత, రజసా = ప్రకాశించు పరాగముచేత; వేధసః = బ్రహ్మలను; నిర్మిమాణా = సృష్టించుచున్న; రమ్య + ఆవర్త, ద్యుతి, సహచరీ = రమణీయముగా సుడి తిరిగెడు కాంతితో కూడుకొనియున్న; రంగనాథస్య = రంగేశునియొక్క; అసౌ = ఈ యెదుట కనబడుచున్న; నాభిః = బొడ్డు; మే = నాయొక్క; మానసం = మనస్సును; ప్రతికలం = ప్రతిక్షణము; సంప్రీణాతి = ఆనందపరచు చున్నది.

తాత్పర్యము :-

దివ్యస్వరూపానికి మధ్యన ఒద్దికగా ఉంటూ, చేతనాచేతన రూపమైన విశ్వాన్ని ప్రళయకాలంలో భద్రంగా దాచిపెడుతూ, సృష్టికోసం తనలోనే వెలసిన తామర పుప్పొడినుంచి ఒక విరించిని సృజింపజేస్తూ, కమనీయకాంతులు లోపల రమణీయంగా సుళ్ళుతిరిగే శ్రీరంగనాధుని గంభీరమైన నాభి ప్రతిక్షణమూ నా డెందాన్ని ఆనందమయం చేస్తున్నది.

వ్యాఖ్య :-

ఈ శ్లోకం ధ్యేయమైన నాభిని వర్ణిస్తున్నది.

"ఏకైకశోఽంగాని ధియానుభావయేత్పాదాది" (భాగవతం 2-1-13).

స్వామి శ్రీపాదాలు మొదలుకొని ఒక్కొక్క అవయవం అంతరంగంలో సుప్రతిష్ఠితమయ్యేంతవరకు అత్యంత ప్రేమభావంతో ధ్యానం చేయాలి, అని శ్రీ శుక యోగీంద్రుల సూక్తిసుధ.

"ఈక్షేతచింతామయ మేవమీశ్వరం, యావన్మనోధారణయావతిష్ఠతే" (భాగవతం 2-1-12).

శ్రీరంగనాధుని యూరువులను చింతించిన తర్వాత దేశికుల మనస్సు మెల్లగా పైకి ప్రాకింది. ఇప్పుడు ప్రతిక్షణం ఆనంద మధికమవుతున్నదే కాని అంతుపట్టుటలేదు. ఇంతకు ఇది 'సుజాత'. ఆ దివ్యమంగళమూర్తికి కొలిచినట్లు మధ్యన శోభాయమానంగా ఉంది. చేతనాచేతనమయమైన సకల భూతజాలం ప్రళయకాలంలో వేర్పరచరాని విధంగా ప్రకృతిలో లీనమైనా, ఆయా వ్యక్తిగత చిహ్నాలకు నష్టం కలుగకుండా ఆ ప్రకృతిని "తమః పరేదేవ ఏకీభవతి" అని శ్రుతి పలికినట్లూ, చల్లగా కాపాడే పరాత్పరుని పొక్కిలి మిక్కిలి లోతైనది.

ప్రళయాంతం అంటే సృష్ట్యారంభంలో శ్రీమన్నారాయణుని నాభినుంచి నిడివి కాడ కలిగిన తామరపూవు పుట్టుతుంది. ఆ పుష్పపరాగం నుంచి బ్రహ్మ జన్మిస్తాడు. ఎన్నిసార్లు సృష్టియైనా, ఈ విధానం మారదు. కాబట్టి పరమాత్ముని నాభి ఒకప్పుడు విశ్వాన్ని అంతర్భవింప చేస్తుంది; ఒకప్పుడు ఆవిర్భవింప చేస్తుంది; అని కవి హృదయం.

'ధాతా యథాపూర్వ మకల్పయత్' అన్నది తొలిపలుకు.

సర్వేశ్వరుని నాభి ఒక సుడిగుండం. అందులో అనేక కాంతులు రామణీయకంగా ప్రదక్షిణం చేస్తుంటాయి.

"తచ్చ సంస్మృత్య సంస్మృత్య... హృష్యామిచ పునః పునః" అని సంజ యుడు సంతోషించినట్లు, దేవదేవుని నాభిని చింతించి దేశికులు తన డెంద మానంద కందళిత మయినదన్నారు.

ఈ కృతి చమత్కృతి గమనీయం.

అట్టడుగున ఉన్న నుడుగు 'నాభి' గాంభీర్యాన్ని సూచిస్తుంది.

జగత్తు క్రియా ప్రధానం. విశ్వం భగవంతుని ఐశ్వర్యం.

"దృష్టాసీతా"-కనబడింది సీత-అన్నట్లూ. క్రియాపదం మొదట-"సంప్రీణాతి-నాభిః" అనడంలో ఆనందమే ప్రాథమ్యం కదా ।

6 శ్రీ వత్సేన ప్రథిత విభవం శ్రీ పదన్యాస ధన్యం
మధ్యం బాహ్వోర్మణి వరరుచా రంజితం రంగధామ్నః।
సాంద్రచ్ఛాయం తరుణ తులసీ చిత్రయా వైజయంత్యా
సంతాపం మేశమయతి ధియశ్చంద్రికోదారహారమ్ ॥

అర్థము :

శ్రీ వత్సేన = పుట్టుమచ్చచేత; పథిత విభవం = ప్రసిద్ధమైన ఐశ్వర్యము కలిగినట్టి; శ్రీ పదన్యాస ధన్యం = లక్ష్మీదేవి అడుగులుండుటచేత ధన్యమైనట్టి; మణి వరరుచా కౌస్తుభమణి కాంతిచేత; రంజితం = ప్రకాశించునట్టి; తరుణతులసీ చిత్రయా = పచ్చని తులసిచేత చిత్రముగా నున్న; వైజయంత్యా = వనమాలచేత; సాంద్ర చ్ఛాయం = చిక్కని కాంతి కలిగినట్టి; చంద్రికా + ఉదార, హారం = వెన్నెలను కురి పించు ముత్యాలహారము కలిగిన; రంగధామ్నః శ్రీ రంగధామునియొక్క; బాహ్వోః = భుజములయొక్క; మధ్యం = నడుమనున్న వక్షఃస్థలము; మే = నా; ధియః = బుద్ధి-మనస్సు - యొక్క; సంతాపం = సంతాపమును; శమయతి = శమింపజేయు చున్నది.

తాత్పర్యము :

శ్రీ వత్సమనే పుట్టుమచ్చచే ప్రసిద్ధమై, లక్ష్మీదేవి పాద లక్షణాలతో ధన్యమై; కౌస్తుభమణి కాంతిచే రంజితమై, పచ్చని తులసీ దళాలతో మనోజ్ఞంగా అల్లిన వైజయంతి మాలచే అలరారినదై, వెన్నెలను విరజిమ్మే తెల్లనిముత్యాలహారముతో నిత్యమూ శోభించే శ్రీ రంగధాముని భుజాంతరం—వక్షఃస్థలం, నామనస్తాపాన్ని అర్పివేస్తున్నది.

వ్యాఖ్య :-

శ్రీ రంగధాముని వక్షఃస్థలాన్ని ధ్యానించే శ్లోకమిది.

వక్షఃస్థలమనినేరుగా పేర్కొనక బాహువుల మధ్య స్థలమనడంవల్ల అది అనిర్వాచ్యమని దేశికులు భావించారు. వక్షఃస్థలమందు వెలసిన శ్రీవత్సం వైశ్వరూప్య వైభవాన్ని చాటుతుంది. నేడు కూడా వ్యక్తులను గుర్తించడానికి పుట్టుమచ్చల ప్రాముఖ్యముంది కదా! పైగా, అది ఒక సాముద్రిక లక్షణం. నీలమేఘ శ్యాముని ఉరః స్థలమందున్న తెల్లని రోమాలతో కూడిన ఈ శ్రీ వత్సం విచిత్రమైన మూల ప్రకృతికి సంకేతం. 'అ చిత్తు' అనే తత్త్వమిది.

లక్ష్మీదేవి అడుగులజాడను బట్టి మహోరస్కత ప్రకటిత మవడమేకాక, భగవంతుని తత్త్వమిదేయని ప్రామాణికంగా నిగమశిఖలు నిర్ణయించాయి. లక్ష్మీకటాక్షం ప్రసరించడంవల్ల తాను ధన్యుడయ్యేనని భగవంతుడు భావిస్తాడని, శ్రీ వత్సాంకుల శ్రీ స్తవం. అలాగే దేశికులవారు శ్రీ పదన్యాసం వల్ల భగవద్వక్షం ధన్యమయిందన్నారు. సిరి శ్రీమన్నారాయణుని గుండెలో గూడుకట్టుకున్నందువల్ల కలిమికి అది కాణాచి.

కమనీయమైన కాంతిని ప్రసరించే కౌస్తుభమణికూడా ఎదలోనే ఆభరణంగా వెలసింది. చిత్కళా చైతన్య చిహ్నమే కౌస్తుభమణి. కాబట్టి వేదాన్తదేశికులు మరొకచోట.

"కాశినియిల్ మణియనైత్తుమ్ కాయావణ్ణన్
కడైత్తెడుత్తకౌత్తు వత్తిన్ శీర్మైక్కొళ్ళా"

ప్రపంచంలో ఉన్న ఎన్ని మణులైనా కౌస్తుభమణికి సరితూకపు, సాటికిరాజాలవన్నారు.

"పురుడన్ మణివరమాక పొన్నా మూల ప్పిరకిరుతి మఱువాక" శ్రియఃపతి వక్షః స్థలంలో ప్రకృతి తత్త్వం, జీవతత్త్వం, అనే రెండు తత్త్వాలున్నాయన్నారు.

భీష్ముడు విష్ణుసహస్రనామాల్లో 'ప్రధాన పురుషేశ్వరః' అని స్తుతించాడు. ప్రధానమంటే ప్రకృతి, పురుషుడంటే జీవాత్ముడు. కాబట్టి భగవంతుని వక్షఃస్థలాన్ని భక్తితో భావిస్తే చి దచి దీశ్వర తత్త్వభావాన్ని ధ్యానించినట్లవుతుంది.

"భోక్తా భోగ్యం ప్రేరితారంచమత్వా" అని ఉపనిషత్తు చెప్పినట్లూ, భోక్తయైన చేతనుణ్ణీ, భోగ్యమైన ప్రకృతినీ, స్వతంత్రంగా నిర్వహించే ఈశ్వరత్వాన్నీ ఒకేచోట, ఒకే సమయంలో సముచితంగా సేవించినట్లవుతుంది.

చిత్తం మెత్తపడునట్లు పరిమళించే తరుణ తులసీదళాలనూ, రంగురంగుల పూలనూ చేర్చి కూర్చిన వైజయంతిమాలచే అలంకృత మయినది ఆ వక్షఃస్థలం.

(గోదాస్తుతికి వ్రాసిన 'పరిమళ' వ్యాఖ్యలో వైజయంతి వైభవాన్ని చూడండి) అంతేకాదు; చల్లని వెన్నెలను కురిపించే ముత్యాలహారముకూడా ఉరమునలంకరించడం వల్ల ఉల్లం పల్లవితమవుతున్నది.

"ముత్తుత్తామముమ్" అంటే ఈ ముక్తాదామమే మునివాహనుణ్ణి (తిరుప్పాణా ళ్వారును) 'అయ్యో' అని అరచేటట్లు చేసింది.

"పారమాయ పళవినై పత్తరుత్తు"- శ్రీ రంగశాయివక్షః స్థలం సంసారబాధను అనుభవించే మనస్సును తపింపజేసే పాపరాశిని పటాపంచలుచేసిందని మునివాహనులు మురిసిపోయారుకదా !

ఇంతవిలక్షణమైన స్వామి వక్షఃస్థలం ధ్యానదృష్టిలో బడగానే దేశికుల మనస్తాపం ఉపశమించింది.

ఆరు గుణాలతో నిక్షేపంలా ఉన్న వక్షఃస్థలం ధ్యానించేవారి - ముముక్షువుల- పాపతాపాలను ప్రక్షాళనం చేసి రక్షించకుండునా ?

"ఉరఃస్థలం జ్యోతి రనీకమస్య" (భాగవతం, 2-1-28)

7\. ఏకం లీలోపహిత మితరం బాహు మాజానులంబం
ప్రాప్తా రంగేశయితు రఖిలప్రార్థనా పారిజాతమ్ ।
దృప్తాసేయం దృఢనియమితా రశ్మిభిర్భూషణానాం
చింతా హస్తిన్యనుభవతి మే చిత్ర మాలాన యంత్రమ్॥

అర్థము :

అఖిల, ప్రార్థనా, పారిజాతం అందరి, అన్ని కోరికలనీడేర్చునట్టి: రంగేశయితుః = శ్రీ రంగశాయియొక్క; లీలా + ఉపహితం = విలాసమైన దిండుగా నుంచబడిన; ఏకం = ఒక హస్తమును; ఆజాను, లంబం = మోకాటి వరకు చాచియున్న; ఇతరం = మరియొక; బాహుం = హస్తమును; ప్రాప్తా = పొందినట్టి; సా = అ;హస్తినీ = హస్తములను కలిగియున్న; ఇయం ఈః; దృప్తా దర్పించియున్న; మే = నా యొక్క; చింతా = మనస్సు:-చింతాహస్తినీ = మనస్సనెడి ఏనుగు;- భూషణానాం = ఆభరణములయొక్క; రశ్మిభిః = కాంతికిరణములచే; పగ్గములచేతను; ఆలాన యంత్రం = కట్టుకొయ్యకు; దృఢ, నియమితా కదలకుండ కట్టుబడినదై; చిత్రం = ఆశ్చర్యమును; అనుభవతి = అనుభవించుచున్నది

తాత్పర్యము :

శ్రీ రంగశాయి బాహువులు భక్తుల కోరికలు దీర్చే పారిజాతాలు. ఆ రెంటిలో ఒక్కటి తన తలగడ దిండుగానూ. మరొక్కటి మోకాటిదాకా చాపబడి-పాలించే తీవిని ప్రకటిస్తున్నట్లూ ఉంటుంది, దర్పంతో విచ్చలవిడిగా విహరించేనా మనస్సనెడి ఏనుగు ఆ బాహువులనెడు రెండు మేకులకు నగల కాంతి కిరణాలనెడి త్రాళ్ళతో కదలకుండా బంధింపబడింది. శ్రీ రంగశాయి బాహుసౌందర్యాన్ని చిత్రంగా అనుభవిస్తున్నదీ మనస్సు.

వ్యాఖ్య :

శ్రీ రంగశాయి బాహువులను ధ్యానించే శ్లోకమిది.

శ్రీ రంగశాయి రెండుచేతుల్లో ఒక్కటి తలగడదిండుగా నుపయోగపడుతున్నది మరొక్కచేయి సాముద్రిక లక్షణంగా పాలించే తీవిని ప్రకటిస్తూ మోకాటిదాకా చాప

బడింది. ''ఆలంపురిందనెడుంతడక్కై''. ఆ నిడివి చేతులుచాలునన్నంతవరకు పురుషార్థాలను ప్రసాదించునని తిరుమంగై యాళ్వారన్నారు.

ఆ చేతులు యాచకుల పాలిటి పారిజాతాలు. పారిజాతం నందనోద్యానవనంలో నుంటుంది. దేవతలకు కోరిన వస్తువులను ఉదారంగా నిచ్చే తరువు. ఈ చేతులు ఎవరేవి కోరినా వాటిని పుష్కలంగా నిరభ్యంతరంగా పూరించేవి. అట్టి శ్రీ రంగశాయి హస్తములనిస్తుల సౌందర్యాన్నే నిశ్చలితయై సేవిస్తున్న మనస్సు తాదాత్మ్యంతో హస్తి నియే అయింది. హస్తరూప రంజితమయింది కాబట్టి హస్తిని.

అదుపు, ఆజ్ఞకు లోబడక, గర్వంతో స్వేచ్ఛగా,- దారి' తెన్నులేక విచ్చల విడిగా-విహరించే మదగజంలాంటిది మనస్సు. శ్రీ రంగేశుని కటకకేయూరాది భూషణాల కాంతికిరణాలే త్రాళ్ళు. శ్రీ రంగధాముని రెండు చేతులే రెండు మేకులు- కట్టుకొయ్యలు. ఏనుగు ముందరి కాలు నొక మేకుకు, వెనుక కాలును మరొక్క మేకుకు త్రాళ్ళతో కదలకుండా కట్టివేయడం పరిపాటి; ఒక నియమం.

'రశ్మి' అంటే కాంతికిరణం అనీ, రజ్జువనీ రెండర్థాలు.

చింత అనే హస్తిని శ్రీ రంగశాయి బాహుద్వయమనే ఆలానయంత్రానికి ఉజ్జ్వల మైన భూషణ రశ్మలచే దృఢంగా బంధింపబడింది.

''పరం పరం శుధ్యతి ధీర్యథా తథా'' అన్న భాగవతం భావగతమే. భగవంతుని బాహుయుగళ సౌందర్యనిగళితమై బద్ధాంజలియై ధ్యానించే మనోదార్ఢ్యత, చిత్రమైన అనుభవమే కదా !

సహృదయచిత్తభిత్తిపైన వర్ణవ్యంజకంగా చిత్రితమైన దేశికుల ఈ అనల్ప కవితా శిల్పాన్నీ-ఇట్టి కల్పనా సామర్థ్యాన్నీ- దయాశతకం (99)లోనూ, యతిరాజసప్తతి (59)లోనూ చమకంగా తిలకించి, పులకించి, నమకం చెప్పవలసిందేకదా ! ఇది, మాఘ కవి రైవతక పర్వత వర్ణన-వారణేంద్రలీలను గమకిస్తున్నది.

8. సాభిప్రాయ స్మిత వికసితం చారు బింబాధరోష్ఠం
దుఃఖాపాయ ప్రణయినిజనే దూరదత్తాభి ముఖ్యమ్ ।
కాంతం వక్త్రం కనక తిలకాలంకృతం రంగభర్తు
స్స్వాంతే గాఢం మమవిల గతి స్వాగతో దార నేత్రమ్॥

అర్థము :

సాభిప్రాయ స్మిత వికసితం = ఆశయముతో కూడిన చిరునవ్వుచే విప్పారిన; చారు = అందమైన; బింబ + అధర + ఓష్ఠం = దొండపండువలె నెఱ్ఱని మోవిగల; దుఃఖ + అపాయ, ప్రణయిని = దుఃఖమును బాపుటకై ఇష్టపడుచున్న; జనే = జనమునెడ; దూర, దత్త + అభిముఖ్యం = దూరమువరకు ప్రసరింపజేయు అభిముఖ భావము కలిగిన; కనక తిలక + అలంకృతం = బంగారు - బొట్టుచే సింగారింపబడిన; స్వాగత + ఉదార, నేత్రం = స్వాగతమును ప్రకటించు ఉదారమైన చూపులు కలిగిన; కాన్తం = ఆకర్షించునట్టి; రంగభర్తుః = శ్రీ రంగనాథునియొక్క; వక్త్రం = మొగము; మమ = నా; స్వాంతే = మనస్సునందు; గాఢం = స్నిగ్ధముగా; విలగతి = తగుల్కొను చున్నది.

తాత్పర్యము :

దొండపండులా అందమైన అధరోష్ఠం ఆశ్రితులపట్ల సాభిప్రాయంగాచిరునవ్వును చిందిస్తూ, ఉజ్జ్వలంగా ప్రకాశించే ఊర్ధ్వపుండ్రం ఉన్నతిని సూచిస్తూ, ఔదార్యాన్ని ప్రకటించే కన్నులు స్వాగతం పలుకుతూ, దుఃఖాన్ని బాపుమని వేడుకునే ఆర్తులకు అల్లంత దూరాననే అభిముఖ సంపత్తును అందిస్తూ-దర్శన భాగ్యాన్ని కలిగిస్తూ, గొప్పగా ఆకర్షించే శ్రీ రంగనాయకుల తిరుముఖ మండలం నా హృదయంలో స్థిరంగా నెలకొని విలసిల్లుతున్నది.

వ్యాఖ్య :

ఈ శ్లోకంలో శ్రీ రంగేశుని తిరుముఖ మండలం ధ్యేయాంగం.

"అప్పొళుదైత్తామరైప్పూ"-అని నమ్మాళ్వార్ల శ్రీసూక్తి. శ్రీ రంగనాథుని తిరుముఖ మండలం అప్పుడు వికసించిన అరవిందంలా చిరునవ్వుతో చిందులాడుతుంది. 'నిర్వ్యాజ మందస్మితమ్' అన్నట్లూ శ్రియఃపతికి ఈ చిరునవ్వు సహజ సిద్ధం. ఆ చిరునవ్వులో ఆశ్రితుల పట్ల ఒక అభిప్రాయం గోచరిస్తుంది.

"ప్రజ్ఞావాదాంశ్చ భాషసే"-రథికుడైన పార్థుణ్ని చూస్తూ, "తెలివిగల వానిలా మాట్లాడుతున్నావయ్యాః" అంటూ శ్రీ కృష్ణుడు సరసంగా చిరునవ్వు చిందించినట్లూ ఉంటుంది,

"కున్ఱ మెదు త్తపిరాన్ మురుపలెన దావియదుమ్" (తిరువాయ్ మొళి) గోవర్ధన గిరిధారి చిందించే చిరునవ్వును ఆనందంగా అనుభవించినవారు పకుళాభరణులు. ఎఱ్ఱని దొండపండులా ఉన్న ఆ శ్రీరంగ పతిమోవిని సేవించగనే దేశికుల చిత్తం చిగురించింది. 'పవళవాయ్'-పగడంలాంటి మోము-అన్నారు తొండరడి ప్పొడి ఆళ్వార్.

"శెయ్య వా యయ్యో ఎన్నెచ్చిందై కవర్న్దదువే"

"అయ్యో ! ఈ ఎఱ్ఱని మోము నా మనస్సునపహరించిందే!' అని తిరుప్పాణాళ్వార్ ఆర్తిచేస్తుతించారు.

"బింబాధరం స్పృశతి రాగవతీ మతిర్మే"- దేశికులే మరొక్కచోట, చూచిన వెంటనే రాగవతియైన నా మతి-మనస్సు-బింబఫలం లాంటి అధరాన్ని అనుతున్నదే ! అన్నారు.

"కోళ్ శై తామరై యుం కొడియుం పవళ ముం విల్లుమ్"అని నమ్మాళ్వార్లు శ్రీయఃపతి ముఖ లక్షణాలన్నింటినీ ఒక్క పాశురంలో స్తుతించినట్లే, దేశికులీ శ్లోకంలో స్తుతించారు.

దుఃఖాన్ని దూరం చేయుమని వేడుకుంటూ భగవంతుని ముఖారవిందాన్ని సందర్శింపగోరే వారికోసం శ్రీ రంగనాధుడు ఎల్లప్పుడు కనుమేరదూరంలో అభిముఖుడయ్యే ఉన్నాడు.

జీవుడు ప్రకృతి బద్ధుడై సత్త్వరజస్తమస్సులనెడి మూడు గుణాలచే ప్రభావితుడవుతుంటాడు. దేవుడు జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్యతేజస్సులనెడి ఆరు గుణాలతో పరిపూర్ణుడు. కాబట్టి, జీవుడు దేవుని వైపు చూడక 36 అంకె వలె పెడమొగం పెట్టి జీవితకాలాన్ని ఈడుస్తుంటాడు. దేవుడెప్పుడూ 63వ అంకెవలె జీవులు ఉండాలని అభిలషిస్తాడు. కాబట్టి, సదాచార్యులను సమాశ్రయించడంవల్ల ఆచార్య కటాక్షం, 36గా ఉన్న జీవుల పరిస్థితిని 63గా పరిగణింపజేసి, భగవదాభిముఖ్య మనెడి సంపదనందిస్తుంది.

ఊర్ధ్వ పుండ్రం-కస్తూరి తిలకం-తో ఉజ్జ్వలంగా ప్రకాశించే శ్రీ రంగేశుని ముఖారవిందం-దేవతానుగ్రహం సూటిగా, సుందరంగానూ ఉన్నతినీ, ఊర్ధ్వగతినీ కలిగించేలా-ఆకర్షిస్తుంది.

చివరకు స్వామినేత్ర సౌందర్యం గోచరిస్తుంది. నయన సౌందర్యం మొదటనే గోచరిస్తే, తక్కిన మౌళిక లక్షణాలు మనస్సుకు చక్కగా నాటక పోవును కాబోలు.

"పెరియ వాయ్ కణ్గళ్ ఎన్నై పే దైమైశెయ్దనవే"॥ అని యోగివాహనుల సూక్తి.

భగవంతుని నయనాలు దయారసభరితాలు.

దయా భరితై రపాంగైః॥

దయాతరంగానుచరాః కటాక్షాః"

"అనుకంపాసరిదంబుజై రపాంగైః" అని దేశికులకు భగవన్నయన సౌందర్యం గోచరించిన స్తోత్రాలనేకాలున్నాయి.

శ్రీ రంగనాథుని కళ్ళు దయతో స్వాగతం పలుకుతూ, ఔదార్యాన్ని ప్రకటిస్తుటాయి.

"దృష్ట ఏవహి నశోకమపనేష్యతి రాఘవః"
శ్రీరాముని దృష్టి సోకిన వెంటనే దుఃఖం దూరమవుతుందని విభీషణుని అభిభాషణ.

యమనియమ ప్రాణాయామాది విధానమేదీ అవసరం లేకుండా విద్యుదయస్కాంతంలా, ఆ స్వామి వదనారవిందం ఆకర్షించగా మనస్సు అక్కడే అంటుకొని అనందిస్తున్నదన్నారు ఆచార్యులు.

9\. మాల్యైరంతః స్థిర పరిమళైర్వల్లభా స్పృశ్యమానైః
కుప్యచ్చోళీ వచన కుటిలైః కుంతలైః శ్లిష్టమూలే।
రత్నా పీడద్యుతి శబలితే రంగభర్తుః కిరీటే
రాజన్వత్యః స్థితి మధిగతా వృత్తయశ్చేతసో మే ॥

తాత్పర్యము

వల్లభా స్పృశ్యమానైః = ప్రియురాండ్రచే స్పృశింపబడుచున్నట్టి; అంతః, స్థిర పరిమళైః = (కిరీటము) లోపల గాఢముగా పరిమళించుచున్న; మాల్యైః = పూల మాలికలచేత; కుప్యత్ + చోళీ, వచన, కుటిలైః + కోపించుచున్న చోళ దేశపు మగువ

మాటలవలె వక్రముగానున్న, కుంతలైః = ముంగురులచేత; శ్లిష్టమూలే = అలుముకున్న అడుగుభాగము కలిగిన; రత్న + అపీడ, ద్యుతి, శబలితే = రత్నాలు దండచుట్టినట్లు తాన శిఖర కాంతిచేపలు రంగుల ప్రకాశించు; రంగభర్తుః = శ్రీరంగపతియొక్క కిరీటే = మకుటమునందు; మే = నా యొక్క; చేతసః = మనస్సుయొక్క; వృత్తయః = చేష్టలు; రాజన్వత్యః = రాజుగలవియై; స్థితిం = నిలకడను; అధిగతాః = పొందినవి.

తాత్పర్యము :

శ్రీభూ నీళాదేవతామ తల్లులు వాల్లభ్యంతో అల్లి ముద్దుగా శిరమున తురిమిన పూలమాలికలు, లోలోపల కమ్మని తావులను విరజిమ్మగా; ప్రణయ కోపముతో చిఱ చిఱలాడే చోళ దేశపు వనితల వక్రోక్తుల్లా కుటిలంగా ఉన్న కుంతలాలను;- ఉంగరాల జుట్టును- ఆవరించి, శిఖరం చుట్టూరా పొసగిన రకరకాల రత్నాలవల్ల పలు వన్నెల చిన్నెలతో కనబడే శ్రీరంగరాజు కిరీటాన్ని సేవించినాచిత్తవృత్తులు రాజాధీనములై నిశ్చలంగా నిల్చిపోయినాయి.

వ్యాఖ్య :-

ఈ శ్లోకంలో ధ్యానయోగం శిఖరాగ్రం చేరినది.

భగవంతుని నామావళిలో మొదట మనం పేర్కొనే నామం 'కేశవాయనమః; అందమైన కేశములను వహించేవాడు 'కేశవుడు'. అని అన్వర్థం. ముచ్చటగా ఉన్న ముంగురులకు ముగ్ధలైన శ్రీ భూనీళాదేవ తామచర్చికలు వాసనగల పూవులను నేర్పుతో కూర్చి, మాలికలసల్లి, శ్రియఃపతి శిరోజాలకు చుట్టుతుంటారు.

గోదా దేవిలా ముచ్చటపడి, ప్రియురాండ్రు తమ తలలో తురుముకున్న పూల మాలికలనే తీసి, శ్రీరంగనాథుని ఉత్తమాంగము నలంకరించేవారు కాబోలు.

భగవంతునిది ఉంగరాల జుట్టు. ప్రణయకోపంతో చోళ దేశపు వనితలు చిఱ చిఱలాడుతూ, సరసంగా మాట్లాడుతారు. వలపు తలపోలం దాటిన మాటలు కుటిలంగా ఉంటాయి. అలంకార శాస్త్రంలో ఇలాంటి మాటలను 'వక్రోక్తులు' అంటారు.

'వక్రోక్తియే కావ్య జీవితం' అన్న కుంతలుని సిద్ధాంతం గమనార్హం. అలకతో ఉన్న చోళదేశ పాటలగంధి మాటల్లా కుటిలంగా ఉన్న కుంతలాలు కూడా పూల మాలికలతోపాటు కమ్మని తావులను విరజిమ్ముతూ, శ్రీ రంగరాజు కిరీటపు టడుగు భాగాన్ని లోలోపల పూర్తిగా అలుముకున్నాయి. ఇక కిరీటానికి వెలుపల నవరత్నాలు తాపబడినాయి, కాబట్టి రకరకాల రంగుల కాంతుల నెగజిమ్మే ఆరతనాల శిఖరం మిలమిలా మెరుస్తున్నది.

"తుళబ విరైయార్ కమళ్ నీణ్ముడి" అని తిరుప్పాణాళ్వార్ కిరీటాన్ని స్తుతించారు.

శిరస్సు నలంకరించిన మకుటంపైన మనస్సు మగ్నమయితేకానీ భగవద్ధ్యానం పర్యాప్తం కాదు. తలకు అలంకారం మాత్రమే కాక, 'పతిం విశ్వస్య' అనే వేద వాక్కును బట్టి అఖిల భువన రాజ్యాధిపత్యానికి ప్రత్యక్ష లక్షణం కిరీటం.

"అధిరాజ్య మధికం భువనానాం, ఈశతే పిశునయన్ కిలమౌళిః". అని శ్రీవత్సాంకులు వరదరాజును స్తుతించారు.

"చూడాచుంబి ముఖాంబుజం" అని శ్రీ పరాశరభట్టర్ స్తుతించినట్లు, శ్రీ రంగరాణ్ముఖ పద్మాన్ని ముద్దాడుతున్న కిరీటం ఉభయ విభూతుల ప్రాభవ వైభవాలను ప్రకటిస్తున్నది.

ఇట్టి విశ్వాధీశుడైన శ్రీరంగ భర్త కిరీటాన్ని సేవిస్తున్న దేశికుల చిత్తవృత్తులన్ని అక్కడనే ఆగిపోయాయి.

మనోవృత్తులాగి పోవడానికి మొదటి కారణం అవి అంతకన్నా పైకి పోవడానికి స్థానం లేకపోవడమే కదా! చిత్తం శిఖరాగ్రం చేరింది, కాబట్టి మరో కోరికయే లేని దెందం మానుషానందం నుంచి బ్రహ్మానందానుభూతిని పొంది సంతృప్తి చెందడం, రెండవ కారణం

"శ్రోత్రియ స్యచాకామహతస్య: సఏకోబ్రహ్మణ ఆనందః". (ఆనందవల్లి)

'రాజన్వత్యః'- రాజునాజ్ఞకు లోబడిన చిత్తవృత్తులు తమ శ్రేయస్సు-భద్రత-రాజాధీనమే అని కట్టడితో కదలక నిల్చినవి.

'యోగం' అంటే చిత్తవృత్తి నిరోధమే కదా!

''అర్థ్యా తిష్ఠతి మామికా మతిరసౌ వాజన్మ రాజన్వతీ.'' అన్న దేశికుల ధిషణ సహజంగా శ్రీరంగేశ్వరాధీనమై, ఆయన రక్షకత్వంలోనే రమ్యావిష్కృత మవుతున్న దనడం నిర్వివాదాంశం.

10. పాదాంభోజం స్పృశతి భజతే రంగనాథస్య జంఘా
మూరుద్వంద్వే విలగతి శనైరూర్ధ్వ మభ్యేతి నాభిమ్।
వక్షస్యాస్తే వలతి భుజయో ర్మామికేయం మనీషా
వక్త్రాభిఖ్యాం పిబతి వహతే వాసనాం మౌళిబంధే॥

అర్థము :-

ఇయం = ఈ, మామికా = నాదైన; మనీషా = బుద్ధి; (మనస్సు) రంగనాథస్య శ్రీరంగ నాథుని యొక్క; పాద + అంభోజం = పాద పద్మములను; స్పృశతి = నిమురుచున్నది; జంఘాం = పిక్కలను; భజతే = సేవించుచున్నది; ఊరుద్వంద్వే = తొడల జంటను; విలగతి లగించుచున్నది; శనైః = మెల్లగా; ఊర్ధ్వం పైకి; అభినాభిం = నాభికెదురుగా; ఏతి = చేరుచున్నది; వక్షసి = ఉరఃస్థలమున; ఆస్తే = అధివసించుచున్నది. భుజయోః = బాహువులకు; వలతి = చుట్టుకొనుచున్నది. వక్త్ర + అభిఖ్యాం = ముఖ కాంతిని; పిబతి = త్రాగుచున్నది; మౌళిబంధే = కిరీటమునందలి; వాసనాం = సౌరభమును; వహతే = మూర్కొనుచున్నది.

తాత్పర్యము :-

ఈ మనీష శ్రీరంగనాథుని పాద కమలాలను సున్నితంగా స్పృశిస్తూ, జంఘలను జన్మరాహిత్యంగా సేవిస్తూ, ఊరువులను చొరవతో తగులుతూ, పైకి మెల్లగా

ప్రాకి నాభిని జేరి, ఎదమీద నెమ్మదిగానుండి, బాహువులను వలగొని, ముఖవర్చస్సును చూరగొని, కిరీట పరిమళాన్ని మూర్కొని పరవశించింది.

వ్యాఖ్య :-

శ్రీరంగనాథుని అంగ ప్రత్యంగ సౌందర్యాన్ని అనుభవిస్తూ శిఖరాగ్రం చేరిన చిత్తం, పునరావృతమై సర్వాంగ సౌందర్యాన్ని సాముదాయికంగా అనుభవించే శ్లోకమిది:-

రెండవ శ్లోకంనుంచి తొమ్మిదవ శ్లోకందాకా- దేశికుల మనస్సు స్వామి శ్రీపాదాలు మొదలుకొని శిరః కిరీటం చేరేదాకా- ప్రత్యేకావయవ సౌందర్యానుభూతి వల్ల కలిగిన ఆనందం పరాంకోటికి చెందింది.

"నీలమేని అయ్యో! నిఱైకొణ్ణదు ఎన్నెంజినైయే" అని తిరుప్పాణాళ్వారు మనస్ఫూర్తిగా సేవించినట్లే, రమ్య రసాకృతిగా భాసించే శ్రీ రంగేశ్వరుని దివ్య మంగళ విగ్రహ సమగ్ర సౌందర్య వైశిత్యాన్ని- ధ్యానయోగంలో నవ(మ)దశను- నిర్భరంగా అనుభవించడానికి దేశికుల చిత్తమాయత్తమయింది.

దశావతార స్తోత్రంలో ఒక్కొక్క అవతార వైభవాన్ని వేర్వేరుగా శ్లోకించిన తర్వాత అవతార ప్రాముఖ్యాన్ని ఒక్కొక్క విశేషణముతో సూచిస్తూ, పది అవతారాల నొకే శ్లోకంలో స్తుతించారు. "ఇచ్ఛామీన విహార కచ్ఛప...." అనే శ్లోకమది. అలాగే ఈ శ్లోకంలో ఒక్కొక్క అవయవానికి ఒక్కొక్క క్రియా పదాన్ని సకర్మకంగా ఉపయోగించి. సాపేక్షంగా సన్నుతింవారు దేశికులవారు.

ధ్యానాత్మికయైన దేశికులమనీష నాయికగా చిత్రింపబడింది.

ఈ నాయిక ప్రప్రథమంగా స్వామి శ్రీ పాదాలను ఆదరంతో మృదువుగా స్పృశిస్తున్నది. పిమ్మట సంసార ప్రతిబంధకం నుంచి విడిపించునన్న అధ్యవసాయంతో పిక్కలను సేవిస్తూ చొక్కుతున్నది. తర్వాత శ్రీభూనీళల భోగానుభవానికి అభివ్యంజకంగానున్న ఊరువులను మురిపెంతో చేరి ముచ్చట పడుతున్నది.

మందార మకరంద మాధుర్యమునదేలిన మధుపంలా ఈ మనీష - నాయిక - మెల్లగా మీదికెగబ్రాకి నాభి గాంభీర్యాన్ని గ్రహిస్తున్నది. అచ్చటి నుంచి లేచి

భగవంతుని యెదపై నెమ్మదిగా నివసిస్తున్నది. 'ఆస్తే' ఈ క్రియా పదం అకర్మకం. ఆవక్షః స్థలం ఇంతకుముందే లక్ష్మీదేవికి పీఠం కదా! ఆమె ఈ క్రొత్త నాయకిని తన అంగమే అన్నట్లూ ఆదరిస్తుంటే, ఆమె దయా తరంగాలలో ఓలలాడుతూ, ప్రశాంత తనూ, ప్రమోదాన్నీ, ప్రాంతీయ సౌందర్యాన్నీ అనుభవిస్తూ, ఈ 'మనీష' చిరకాలం తనను తానే మరచిపోతున్నది. కాబట్టి పిళ్ళై పెరుమాళ్ అయ్యంగారు.

"మయంగి, ఇన్బు మ్మయంగి" అన్నారు.

హఠాత్తుగా బాహువులపైన ప్రసరించిన దృష్టి ఆమె - మనీష - లోని చలన శక్తిని ప్రేరేపిస్తుంది. కాబట్టి ఒక భుజం నుంచి మోచేతికి, అక్కడి నుంచి మణికట్టు మీదుగా అరచేతుల్లోనూ, తర్వాత మళ్ళీ మీదికి పోయి మరో భుజాన కూడా ఇట్లే తిరుగుతూ, పలుసార్లు బాహువుల యందు వలయాకారంగా సంచరిస్తుంది.

సద్యో వికసిత కమలముచేత ఆకర్షితమైన తేనెటీగ అక్కడ లభించిన పూదేనె త్రాగునట్లే దరవికసిత ముఖ కమలము చేత ఆకృష్టమయిన ఈ నాయకి-మనీష- ఆ ముఖ కాంతిని పానం చేస్తున్నది.

"వక్త్రాభిఖ్యాం పిబతి" అనే సరస వాక్యం వల్ల నాయకి అధర సుధారసాన్ని గ్రోలుతున్నట్లు విశదమవుతున్నది.

ఆండాళ్ కూడా 'వాయముదం' భగవంతుని అధరామృతాన్నే ఆపేక్షించింది కదా!

"కదానుచారు బింబోష్ఠం తస్యాః పద్మమివాననం ఈషదున్నమ్య పాస్యామి రసాయన మివాతురః॥" (రా. యు.)

శ్రీరామచంద్ర స్వామి సీతాదేవి యొక్క అధరామృతం కోసం తహతహ పడినట్లూ వాల్మీకి వ్యక్తపరిచాడు.

చిట్ట చివరకు మనీష, మాధవుని మకుట సౌరభానికి మరులుగొని మైమరచి పోతున్నది.

కుటిలాలకల పైన పరిమళించే తులసీదామాన్ని అలంకరించిన, వజ్రాల కిరీటం కలవాడు శ్రీమన్నారాయణుడు.

"నాత్తత్తుళాయ్‌ముడి నారాయణన్''. (తిరుప్పావై),

సర్వేశ్వరుని సన్నిధి జేరిన వారెవరైనా - చేతనాచేతనములు - ఆ పరిమళానికి పరవశించవలసిందే కదా!

"మెయ్ నిన్ఱుకమళ్ తుళవ విరై యేఱు తిరుముడియన్'' (తి. మొ.) తన దేహంలోనుంచి, శ్రియః పతి శిరమున దాల్చిన కమ్మని తులసీ పుష్ప వాసన, గుబా ళించడం వల్ల సర్వేశ్వరుడు - తిరువాట్టారు క్షేత్రపతి - తన హృదయంలో ప్రవేశించా డని నమ్మాళ్వార్లు ఆనందించారు.

అలాగే దేశికుల మనీష, శ్రీరంగేశుని మౌళిబంధ సుగంధాన్ని వహించి సువాసినిగా సమలంకృతయై సందీపిస్తున్నది.

''మామికేయం మనీషా". ఇదినా బుద్ధి - మనస్సు.

'ఇదిగో! నా బిడ్డ స్థితి ఇలాఉంది, - అని "తాయ్‌ప్పేచ్చ్'ః- తల్లి చెప్పుతున్న మాటలా ఉంది, ఈ మాట.

"నంగైమీర్ నీర్ మోర్ పెణ్పెత్తునల్గినీర్,
ఎజ్ఞనేశొల్లుకేన్ యాన్పెత్త ఏశెయ్యై,''

'జ్ఞాన పూర్ణులైన ఇంతులారా! మీరు ఒక బిడ్డను కని పెంచారుకదా! నేను కూడా ఒక చపలను కన్నాను. ఆమె రేయింబవళ్ళు 'శంఖం; చక్రం; తులసి; అంటూ ఆశిస్తున్నది.-'

తన బిడ్డ అవస్థ ఇతరుల బిడ్డలకంటె అసాధారణంగా ఉందని పోల్చి చెప్పి నారు, నమ్మాళ్వార్లు.

ఇతరుల హృదయాలు సాధింపగోర నేరినదాన్ని దేశికుల హృదయం సాధించి తీరినది.

11. కాంతోదారైరయ మిహభుజైః కంకణ జ్యాకిణాంకై
ర్లక్ష్మీధామ్నః పృథులపరిఘై ర్లక్షితా భీతిహేతిః।
అగ్రే కించిత్ భుజగశయనః స్వాత్మనైవాత్మనస్సన్
మధ్యేరంగం మమచహృదయే వర్తతే సావరోధః॥

అర్థము :

కాన్త + ఉదారైః = ప్రియమైన, ఉదారములునైన; కంకణ, జ్యా, కిణ + అంకైః = స్వర్ణ కంకణముల, నారివలనికాయల గుర్తులు కలిగిన; లక్ష్మీధామ్నః = లక్ష్మీ దేవికి నెలవైన వక్షః స్థలమునకు; పృథుల పరిఘైః = పెద్ద గడలుగా నున్న; ఇహ = ఈః; భుజైః = (నాలుగు) బాహువుల చేత; లక్షి తా + అభీతి, హేతిః = ప్రకటింపబడిన అభయముద్ర, ఆయుధములు కలిగియున్న; అయం = ఈః; భుజగ శయనః = శేషశాయి, శ్రీరంగనాథుడు; ఆత్మనః = తనకు; కించిత్ = కొంచెము; అగ్రే = ముందట; స్వ + ఆత్మనా + ఏవ = తనదైన రూపముతోనే; (తానే) స + అవరోధః, సన్ = పత్నులతో కూడుకొన్నవాడై: మధ్యేరంగం = శ్రీరంగమందు; చ = మరియు; మమ = నా యొక్క; హృదయే = డెందము నందు; వర్తతే = ఉన్నాడు.

తాత్పర్యము :-

శేషశాయి అయిన శ్రీరంగనాథుడే తనకు కొంచెము ముందువైపు ఉత్సవ మూర్తిగా నిల్చియున్నాడు. బంగారు కంకణాలూ, నారి సారించడంవల్ల కాయలు గాసిన గుర్తులూ కలిగిఉన్న, లక్ష్మీదేవి ధామానికి పెట్టని కోటగా ఉన్న, అభయ ముద్రను ప్రకటిస్తూ ఆయుధాలను ధరించియున్నట్టి, కాంతోదారములైన నాలుగు భుజాలతో, శ్రీ భూనాళ్ళి పత్నులతోనూ, శ్రీరంగంలో వెలసిన ఉత్సవమూర్తి-శ్రీరంగనాథుడు-ఆహా! నా అంతరంగంలోనూ వెలసి ఉన్నాడు.

వ్యాఖ్య :-

రమణీయమైన ఉత్సవమూర్తిని కమనీయంగా వర్ణించే శ్లోకమది.

ధ్రువమూర్తియే ఉత్సవ మూర్తిగా విరాజిల్లుతున్నాడు. శ్రీరంగ క్షేత్రంలో మూలపెరుమాళ్ శేషతల్పంపైన పవళించి ఉన్నాడు. రెండు చేతులు కలవాడు.

ఉత్సవమూర్తి చతుర్భుజుడు. ఉభయనాచ్చిమార్లతో ఉజ్జ్వలంగా ప్రకాశించే ఉత్సవ బేరం మూల విరాట్టుకు కొంచెం ముందువైపున్నది. "అగ్రేకించిత్.... స్వాత్మనైవాత్మ నస్సన్" అనడంవల్ల దేవుడొక్కడే అని సుశ్లోకింపబడింది.

చతుర్భుజుడైన చతురమూర్తిని సేవించిన ఆళ్వారాదుల ఉల్లంకోరకస్ఫోర కంగా పల్లవించింది.

"కడర్మడియన్ నాన్గుతోళన్ కుణిశార్ఙన్
ఒణ్ శంగతై వాళాళియా నొరువనడియేనుళ్ళానే."

ఇట్లే శ్రీ పరాశరభట్టర్ వారు కూడా,

"స్ఫురదభయ గదా శంఖ చక్రైశ్చతుర్భుజాగ్రైః ర్విశ్వస్మైతిష్ఠమానం".

పై కుడి చేతిలో చక్రం, ఎడమ చేతిలో శంఖం; క్రింది కుడిచేతో అభయ ముద్రను ప్రదర్శిస్తూ, ఎమడ చేతిలో గదను ధరించి విశ్వాత్ముడై యున్నాడని శ్రీరంగ రాజస్తవం చేశారు.

"తేనైవరూపేణ చతుర్భుజేన"- విశ్వరూపాన్ని చాలించి ఆ చతుర్భుజ రూపాన్నే ప్రదర్శింపుము - అని, అర్జునుడు శ్రీకృష్ణుణ్ని ప్రార్థించాడు,

ఆకర్షణీయంగా ఉన్న ఆ నాలుగు చేతులతో ఒకేసారి నాలుగు పురుషార్థాలను ప్రసాదించే మహాదాత, దేవుడే.

"ధర్మార్థ కామ మోక్షాణాం దాతా దేవశ్చతుర్భుజః". కాబట్టి, ఔదార్య గుణంతో రాణించేవి ఆ చతుర్భుజాలు.

ఆ సుకుమారములైన చేతుల మణికట్ల మీద బంగారు కడియాలు ధరించిన గుర్తులు అందంగా ఏర్పడుతున్నాయి. అంతేకాదు; యుద్ధంలో శరసంధానం చేస్తూ అల్లెత్రాటిని ఆకర్ణాంతం లాగడంవల్ల చేతులు కాయలు గాచినాయి. "బాహ్వోర్మధ్యం" అని 6వ శ్లోకంలో; ఇక్కడ 'పరిఘ' అనడంలోనూ, దేశికుల కవనం నాకవనమన కుంటారా? విజ్ఞులు. వాస్తవంగా ఆ చేతులు ఇందిరా మందిరానికి నాలుగు స్తంభాలుగా

ఉన్నాయి. శ్రీ మహాలక్ష్మి పీఠానికి నలువైపుల నాలుగు గడలుగా ఉన్నాయి. లక్ష్మి నివాస వక్షః పరిరక్షణ కోసం ఆ రెట్టలు పెట్టని కోటలయ్యాయి.

"ప్రాయః ప్ర పదనే పుంసాం పౌనః పున్యం నివారయన్.
హస్తః శ్రీరంగ భర్తుర్మా మవ్యాదభయ ముద్రితః"-

'మీరు భయపడకండి; నేను మిమ్మ రక్షించగలను' అంటూ ఒక్కసారి ప్రపత్తి చేసేవారికి. మళ్ళీమళ్ళీ ప్రపత్తి చేయకుండా, అభయమిస్తున్న హస్తమూ స్పష్టంగా కనబడుతుంది.

శ్రీరామ గోష్ఠిలో చేరడంకంటే విభీషణుడు రాక్షస గోష్ఠిలో నుంచి బయట పడడమే శ్రేష్ఠమని భావించాడు శ్రీరామభద్రుడు, కాబట్టి, సుగ్రీవాదులు అడ్డుపడినా 'తవాస్మీతిచ యాచతే'- నేను నీ వాడనే; కాపాడవయ్యా; రాఘవయ్యా!' అని ఒక్కసారి శరణాగతి చేసే సర్వప్రాణులకూ అభయమిస్తున్నానని తన నియమాన్ని ప్రకటించాడు కదా!

"అభీతిహేతిః"- ఈ సమస్తపదం, పరమాత్మని శరణాగత రక్షా దీక్షను ప్రకటిస్తున్నది.

తనను నమ్ముకొన్న వారి ఆర్తిని విన్నవెంటనే వారి భయాన్ని మొదట నివారించి, ఆలస్యాన్ని సహించక కాపాడడం కోసం ఆయుధ పాణియైనాడన్న భావం అనురణిస్తున్నది.

"జ్ఞానీత్వాత్మైవమే మతం"- అని పార్థసారథి పడినపాటు ప్రపన్నుల రక్షించడం వల్ల తనను తాను రక్షించుకోవడమనియే కదా!

"వర్తతేసావరోధః"- రెండు ఆడ హంసల నడుమనున్న రాజ హంసలా ఉభయ నాచ్చియార్లతో ఉత్సవమూర్తి ఉల్లసిల్లుతున్నాడు. "అంగనా మంగనా మంతరే మాధవః"- 'నారీ నారీ నడుమ మురారి'యై రాసక్రీడ సలిపినవాడే కదా.

అతి సుందరీ మణులైన నాచ్చియార్లు ఉభయపార్శ్వముల నిలిచి స్వామిని అద్భుత సౌందర్య నిధిని చేరారు.

"మమ హృదయే వర్తతే"- శ్రీరంగనాధుడు నాడెంద మందందంగా వెలసినాడని ఆనందించారు దేశికులు.

"అరవత్త మఱియినొడుమ్ ఆళగియ పాఱ్కడలోడుమ్,

అరవిందప్పావైయుమ్ తానుమ్ అకమ్పడి వన్దు పుగున్దు.

శ్రీమన్నారాయణుడు ఒంటరిగా రాక, పాలకడలితోనూ, పాన్పుగా ఉన్న పాప తేనితోనూ, లక్ష్మి దేవితో పాటువచ్చి తన గుండెలో గూడు కట్టుకున్నాడు- అని పెరియాళ్వారు పాడినారు.

''మమచ హృదయే"- విష్ణుచిత్తుని- పెరియాళ్వారుల- యెదలోనే కాదు, నా మదిలో కూడా సర్వేశ్వరుడు అలాగే వెలసియున్నాడన్నారు దేశికులు.

"పనికృడలుళ్ ప్పళ్ళికో ళైప్పళ.కవిట్టు ఓడివన్దు, ఎన్మనకృడలుళ్ వాళ్. వల్లమాయ్."

తన శయ్యాసీమయైన చల్లని పాల సముద్రాన్ని విడిచిపెట్టి పరుగిడి వచ్చి నా హృదయ సాగరంలో ఓలలాడుతున్నాడు; అన్నారు మరోసారి పెరియాళ్వార్లు. కాని దేశికుల ఆనందం మరో తీరున్నది.

''మధ్యే రంగం మమచ హృదయే."

తన నిద్రకు ఏ మాత్రం భంగం కలుగకుండా శ్రీరంగంలో శయనిస్తూ, నా హృదయాన్నికూడా తన నివాసంగా నేర్పరచుకున్నాడని దేశికులు మురిసిపోతున్నారు.

"మమహృదయేచ''- వైకుంఠం, క్షీరాబ్ధి, సూర్య మండలం లాంటి అమేయ సీమా భూములే కాక, సనకసనందనాది మునులూ, పరాంకుశ, పరకాలాది పరమ భాగవతోత్తములూ ఉంటుండగా, ఈ నా భౌతిక కాయంలో, అందులోనూ ఒక చిన్న భాగ్యమైన డెందాన్ని ఎన్నుకొని, అందులో రంజిల్లే శ్రీరంగనాధునికి నాయందెంత అనుగ్రహమో! అని హర్షిస్తూ స్తుతించారు, శ్రీమదాచార్యులవారు.

మొదట ''అంతర్జ్యోతిః కిమపి యమినాం"- యోగుల అంతరంగంలో వెలిగే పరంజ్యోతి- అని స్తోత్ర మారంభింపబడినది. "దృశ్యతే రంగమధ్యే"- అని బాహ్యా నందానుభవమే ప్రకటితమైనది. "మధ్యే రంగం మమచ హృదయే వర్తతే సావ రోధః''- అని స్తోత్రం పూర్తిచేయబడినది.

దేవాలయంలో భగవంతుణ్ని సేవిస్తుంటే కళ్ళు మూసికోవడం, మళ్ళీ తెర వడం, మళ్ళీ మూసికోవడం నైసర్గికం కదా! ఇపుడు బయట కనబడే-నిగమ కాంత శిగలో నగగా వెలిగే- భగవంతుడు హృదయంలో అట్లే భాసిస్తున్నాడా? లేదా? అని సరి చూచుకోవడమే దీని ఆంతర్యం. "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః'' లోపల, వెలుపల, అంతటా నారాయణుడు వ్యాపించి ఉన్నాడని చెవినిల్లు కట్టు కున్నది ఉపనిషద్వాణి.

గీటురాయిపై వన్నెవాసి చూచుకొని, బంగారం చొక్కమే అని తేల్చుకున్నట్లూ, ధ్యానయోగంలో నాలుకతో నామస్మరణ చేస్తూ, హృదయంలో కల్యాణ మూర్తి నియతంగా నిల్చియున్నాడని నిర్భరంగా ఆనందాన్ని అనుభవిస్తుంటారు.

ధ్యానం వల్ల ధ్యేయం హృదయగమ్య మయింది. స్తోత్రం పూర్తి అయినదని వాచ్యంగా కాక వ్యంగ్యంగా వ్యక్త పరచడంవల్ల కవికేసరి పదం ఈ కవికే సరి.

12. **రంగస్థానే రసిక మహితే రంజితాశేష చిత్తే**
విద్వత్సేవా విమల మనసా వేంకటేశేన క్లుప్తమ్।
అక్లేశేన ప్రణిహితధియా మారురు క్షీరవస్తాం
భక్తిం గాఢాందిశతు భగవద్ధ్యాన సోపానమేతత్॥

అర్థము :

రసిక, మహితే = రసికులచే మహిమ ప్రశంసింపబడునట్టి; రంజిత + అశేష, చిత్తే = ఆనందింపబడిన నిండు మనస్సు కలిగినట్టి; రంగస్థానే = శ్రీరంగనాథుని సన్నిధియందు; విద్వత్, సేవా, విమల, మనసా = పండితులను సేవించుట వలన పరి శుద్ధమైన మనస్సుగల; వేంకటేశేన = వేంకటనాథ కవిచే; క్లుప్తం = రచింపబడిన;

ఏతత్ = ఈ; భగవత్ + ధ్యాన, సోపానం = భగవద్ధ్యాన సోపానము (స్తోత్రము); ప్రణిహిత. ధియాం = నిశ్చలాత్ములయొక్క; అవస్థాం = దశను; అక్లేశేన = అనాయాసముగా; ఆరురుక్షోః = ఆరోహింప-పొందగోరువ్యక్తికి; గాఢాం = స్థిరమైన; భక్తిం = భక్తిని; దిశతు = అనుగ్రహించుగాత.

తాత్పర్యము :

అనేక రసికావతంసులు డెందమానంద ధామమయ్యేలా గానం చేసే శ్రీరంగ నాథుని సన్నిధిలో జ్ఞాన వృద్ధుల సేవ చేయడం వల్ల చిత్తశుద్ధి కలిగిన శ్రీ వేంకటనాథ కవి రచించిన ఈ 'భగవద్ధ్యాన సోపాన'మనే స్తోత్రం యోగారూఢ స్థితిని అనాయాసంగా పొందగోరే వారికి స్థిరమైన పరమ భక్తిని ప్రసాదించుగాత.

వ్యాఖ్య :

ఇది ఫలశ్రుతి.

ప్రతి ప్రబంధంలో-స్తోత్రంలో-నూ చివర ఫలశ్రుతి రచించడం సంప్రదాయం. ఇందులో నాలుగంశాలుంటాయి.

1. విషయ వైలక్షణ్యం
2. వక్తృ వైలక్షణ్యం
3. ప్రబంధ వైలక్షణ్యం
4. పఠితలకు లభించే ఫలస్వరూపం.

కలియుగ వైకుంఠమని పేరు పొందిన శ్రీరంగంలో వెలసిన భగవంతుని సకలావయవ సౌందర్యాభివర్ణనమే ఈ స్తోత్ర విషయ వైలక్షణ్యం. మొదటి చరణంలో, ఆళ్వారాదు లెందరో స్తుతించి మనసులో సుందర మూర్తిని నిండుగా నిల్పుకున్నారన్న అంశం మఱుగున పడినట్లున్నది.

బ్రహ్మ విద్యలో పారంగతులైన పండితులకు కాయికంగా, వాచికంగా. మానసికంగా శుశ్రూష చేసి శ్రీ వేంకటనాథ కవి విమల - నిష్కల్మష - మనస్కులవడమే వక్తృ వైలక్షణ్యం. ఇది రెండవ చరణంలో ఇమిడి యున్నది.

'విమలన్' అని తిరుప్పాణాళ్వార్లు "అమలనాదిప్పిరాన్"ను ప్రచురంగా గానం చేశారు. దోషగంధలేశం అంటని వారని అర్థం. ఆళ్వార్లు, క్రమంగా ఆచార్యులెందరో

ఆ 'విమలుని' పాడి పరవశించారు. వారందరికి సభక్తికంగా సముచిత సేవ చేసి ఋణం తీర్చుకున్న దేశికులు విమల హృదయంతో ఈ స్తోత్రాన్ని కల్పించి-రచించి-పాడినారు.

పాడిన స్థలం రంగస్థానం. "ఊర్ పేరు మరంగమే" (నాచ్చి-తిరు) పవిత్ర క్షేత్రం పేరు శ్రీరంగమే. ఇక్కడి దైవమూ శ్రీరంగమే. లయ, రాగ, తాళబద్ధంగా. నవరస భరితంగా ఎందరో గాయకులు-అరైయర్-పాడిన స్థానమిది.

"దేవో న శ్శుభమాతనోతు దశధా నిర్వర్తయన్ భూమికాం, రంగేధా మని లబ్ధ నిర్భర రసై రధ్యక్షితో భావుకైః" అని, దశావతార స్తోత్రం చేశారు దేశికులు. నవరస నిర్భరమైన నాటక రంగస్థానమిది. ఇక్కడ ప్రధాన నటశేఖరుడు శ్రీరంగ నాయకుడు. ఆయన క్రమంగా పది రకాల వేషాలు వేసిన కల్యాణ గుణామృతోదధి కదా! కాబట్టి, శ్రీరంగం ప్రతి వ్యక్తి డెందంలో అమందానందాన్ని కందళింప జేస్తున్నది.

"పొన్న రంగ మెన్నిల్ మయలే పెరుగు మిరామానుశన్" 'శ్రీరంగం' అని ఎవరైనా అంటే, భగవద్రామానుజులవారు ఆ పేరు విన్నంతనే ఆ దివ్య దేశమందున్న ప్రేమ అతిశయించి, పరమ ముగ్ధులయ్యేవారట.

ఇక ఉత్తరార్థ శ్లోకంలో ప్రబంధ వైలక్షణ్యమూ, ఫల స్వరూపమూ వివరింప బడియున్నాయి.

'భగవద్ధ్యానసోపాన' మని ఈ ప్రబంధ-స్తోత్ర-నామం. 'అపాద చూడ మను భూయ హరింశయానం' అన్నట్లు దివ్య సౌందర్యావయవ విశిష్టమైన అర్చామూర్తిని పాదాలనుంచి పద్మరాగాది మణులు పొదిగిన మకుటం వరకు సౌశీల్య సౌలభ్యాది గుణాలను అనుసంధిస్తూ, అనుభవిస్తూ సేవించడం ధ్యాన సోపానం. ధ్యాన పద్ధతి సోపాన రూపంగా కల్పితం కదా!

'కడల్ కడైన్ద ముదుజ్ఞోణ్ణు కలశత్తేని త్తెత్తాపోల్,

ఉదలురుగి వాయ్ తిఅన్దు మడుత్తున్నై నిఱైత్తుక్కొణ్డేన్."- క్షీరాబ్ధిని చిలికి అమృతాన్ని ఎత్తికొని కలశంలో నింపుకున్నట్లూ దేహం కరిగి నోరు తెరచి చేతులు జోడించి పరమ భోగ్యుడైన పరమాత్మణ్ణి నా యెదలో నింపుకుంటానన్నారు విష్ణు చిత్తులు.

రస ద్రవ్యాన్ని పాత్రలోకి ఎత్తికొని నింపడం పాత్ర శక్తినీ, ధ్యానాసక్తినీ తెల్పుతుంది కదా!

దేశికుల రచనలు పరశ్శతములు. కాని ఈ స్తోత్ర రచన వాటికంటె విలక్షణం. మానవ జన్మ రావడం, అందులో కవిత్వమబ్బడం, ఆ కవిత్వము రచన బద్ధమూ, ఆ నిబద్ధ రచన కూడా భగవత్పర మవడం ధన్య లక్షణం.

అంతకన్న విలక్షణమైన ఈ స్తోత్రం భగత్పరమై, తద్ధ్యానపరమై, అదికూడా సోపాన రచనగా ప్రక్రియా వైవిధ్యం కలిగి మహోన్నత పదవిని అధిరోహింప జేయడం మూర్ధన్య లక్షణం.

"దహ్రం విపాప్మం పరవేశ్మభూతం
యత్పుండరీకం పురమధ్య సగ్గ్‌స్థం." (నారాయణోపనిషత్)

హృదయ పుండరీకంలో అంతర్యామిగా ఉన్న భగవంతునియందే తైల ధార వలె ఎడతెగకుండా మనసు నిలిపి ప్రీతిపూర్వకంగా ఉపాసించడం ధ్యానయోగం.

పరమాత్మ ప్రాప్తి రూపమైన మోక్ష (ఫలా) నికి సాధనం పరమాత్మో పాసనయే కదా!

"తేయాంతిసిద్ధిం పరమాంచ వైష్ణవీం"- అని కులశేఖరాళ్వార్ అన్నట్లూ ఇలా ధ్యానించినవారు తప్పక మోక్షం పొందుతారు. ఇదే ప్రణిహితచిత్తులైన యోగులు పొందే దశ. యమ నియమాదు లచే శరీరాన్ని శ్రమపెట్టకుండా ఈ దశను పొంద గోరేవారు ఈ స్తోత్రాన్ని శ్రద్ధతో అనుసంధిస్తే చాలు. పఠితలకూ, ఇది గాఢమైన భక్తిని ప్రసాదిస్తుంది.

"తూయశుడర్ చ్చోది తనదెన్నుళ్ళైత్తాన్."

విమల తేజోమయుడైన సర్వేశ్వరుడు నా హృదయంలో సుప్రతిష్ఠితుడై మహా నంద నిర్భరుడుగా ఉన్నాడు; అని పరభక్తి పరజ్ఞాన పరమ భక్తిసంపత్సమృద్ధులైన నమ్మాళ్వార్లు ఆడి పాడినారు కదా!

శ్రీరంగనాధుని ధ్యానించే ఈ స్తోత్రంవల్ల భక్తి పరభక్తి, పర జ్ఞాన, పరమ భక్తిగా ఎదుగుతుంది.

గాఢాంభక్తిం'దిశతు'=భగవంతునితో వియోగం/విశ్లేషం కలుగని పరమ భక్తిని అనుగ్రహించుగాత. సర్వకాల సర్వావస్థల్లోనూ అనుగ్రహించే అర్థపుష్టి కలిగిన 'విధిలోట్' క్రియాపదం ఇది. ఆచార్య మంగళాశాసనం- పురుషకారం- కూడా సూచితం.

'ఏతత్'- ధ్యానానికి, లేదా సోపానానికి సంబంధించిన చివరి పదం 'ఇంద్రియాణాం మనశ్చాస్మి' అని గీతాచార్యుని మాట. ఇంద్రియాలను అదుపులో ఉంచే మనస్సు పదకొండవది. కాబట్టి, ఈ స్తోత్రంలో పదకొండు శ్లోకాలున్నాయి. "ఉలక ముణ్డ పెరువాయ" అనే తిరువాయ్‌మొళిలో స్వామి పాదాల ప్రశంస ప్రతి పాశురం లోనూ ఉన్నట్లే, ఈ స్తోత్రంలోని ప్రతి శ్లోకంలో కూడా మనస్సుకు సంబంధించిన శబ్దం (భావన, ఆత్మ, మతి, మానసం, ధీ, చిన్త, స్వాంతం, చేతస్సు, మనీష, హృదయం, చిత్తమిత్యాది) ఉపయోగింపబడింది. మందాక్రాంతమయింది కదా! మనస్సు. 'మనః' పదం మారితే, నమః పదం అవుతుంది. త్యాగయాగాలకు ఉపయుక్తం.

ధ్యాన విషయంలో సోపాన రచనా కౌశలం నాన్యతో దర్శనీయం. పరమ భక్తుల చిత్తం సర్వదా భగవదాయత్తం.

కవితార్కిక సింహస్య కల్యాణ గుణశాలినే,
శ్రీమతే వేంకటేశాయ వేదాన్త గురవేనమః,

భగవద్ధ్యాన సోపానం సంపూర్ణం.